# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:79 మంగళవారం 09 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# మోదీయే ఇండియా



**ప్రజా తపన**

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ వర్సెస్ కాంగ్రెస్ అనేలా మారిపోయింది. కర్ణాటకలో బిజెపి ఓటమి ఖాయం అనుకున్న విమర్శకుల నోళ్లకు మోడీ ర్యాలీలు కనువిప్పు కలిగించాయి. కాంగ్రెస్ జట్టు వీక్ గా కనిపిస్తుంది. ఎన్నికలకు ముందు కర్ణాటకలో ప్రధాని మోదీ తొమ్మిది సార్లు పర్యటించారు. ఇప్పుడు దాదాపు 20 చోట్ల సభల్లో ప్రసంగించారు. తనదైన శైలిలో సభికులను తన వైపు తిప్పుకున్నారు. కన్నడ భాషలో మాట్లాడడం, మీరు ఇంటికి వెళ్ళాక మోదీ వచ్చాడని చెప్పండి, మన ఓటు బిజెపికే అని వాళ్లతో మాట తీసుకోండి అంటూ స్థానిక భాషలో మాట్లాడి వారి అభిమానాన్ని పొందుతున్నారు. అమిత్ షా, దేవేందర్ పడ్నషా, బ్రహ్మానందం, ఇలా ప్రతి ఒక్కరూ బీజేపీ తరఫున కర్ణాటకలో జోరుగా ప్రచారం చేశారు. వీళ్ళందరూ ఒక ఎత్తైతే ప్రధాని మోదీ రంగంలోకి దిగేసరికి కమలాలు విప్పారిన దళాలతో తేనెటీగలను ఆకర్షించినట్టు కన్నడ ప్రజలను ఆకర్షింపజేశారు. తాను ఓటర్ తో చెప్పాలనుకున్నది నేరుగా చెప్పేశాడు. ఓపెన్ టాప్ జీపులో అభివాదం చేస్తూ ఒకవైపు ఎస్సార్ బొమ్మయ్ మరోవైపు యడ్యూరప్ప ఇద్దరు కీలక నేతలతో కర్ణాటకలో కలియతిరిగారు. మోదీ పట్ల ఉన్న అభిమానంతో కర్ణాటక ప్రజలు స్థానిక నేతల తప్పొప్పులను పక్కకు పెట్టి మోదీనే మా భవిష్యత్తు అంటూ నినదిస్తున్నారు. 120 స్థానాలకు మించి బిజెపి ప్రభుత్వం పూర్తి స్థాయి మెజారిటీతో అధికారాన్ని స్థాపించనున్నది. 63% కర్ణాటక ఓటర్లు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారు. కరావలి, మలెనాడు, చిత్తూరు కర్ణాటక, కళ్యాణ కర్ణాటక, మొదలైన ప్రాంతాల్లో బిజెపి ఇప్పటికే గెలుపు నల్లేరు పై నడకలాగా మారిపోయింది. బెంగళూరు సిటీ ప్రజలంతా బిజెపి వైపే ఆసక్తి కనబరుస్తున్నారు. కాంగ్రెస్ చేసే కుయుక్తుల వలలో కర్ణాటక ప్రజలు పడేలా లేరు. పైపెచ్చు మైనార్టీ ప్రజలు కూడా బిజెపి వైపే అడుగులు వేస్తున్నారు. నిన్నటి వరకు అంతర్గతంగా భయంగా ఉన్న పార్టీ క్యాడర్లో మోడీ పర్యటన కొండంత మనోధైర్యాన్ని నింపింది. భారం అంతా మోడీ పైనే వేశారు. దీంతో కర్ణాటకలో కాంగ్రెస్ కనుమరుగవడం ఖాయంగా కనిపిస్తుంది. ద్వితీయ స్థానంలో నిలిస్తే నిలవచ్చు. కాంగ్రెస్ పార్టీలో ఉండే అంతర్గత కలహాలే కమలానికి బలం చేకూరే లాగా ఉన్నాయి. అదొక వైపైతే మోదీ పర్యటన కన్నడ ప్రజల్ని బిజెపి వైపు చూసేలా ఏకం చేసింది. మోడీ సమ్మోహన శక్తితో బిజెపి అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. రాజకీయ విశ్లేషకులు కూడా మోదీ పర్యటన దాకా కాంగ్రెస్ అధికారం ఖాయం అనుకున్న వర్గాలు మోదీ పర్యటనతో బిజెపి వైపే ప్రజలు నిలుస్తారని విశ్లేషకులు చెబుతున్నారు.




## తెదేపా అధికారంలోకి రాగానే కర్నూలులో హైకోర్టు బెంచ్



**ప్రజా తపన ,కర్నూలు**

కర్నూలులోని కొండారెడ్డి బురుజు జనసంద్రంగా మారింది. కర్నూలు జిల్లాలో పాదయాత్ర చేస్తున్న తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఇక్కడ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా భారీగా తెలుగుదేశం నేతలు, శ్రేణులు తరలి వచ్చారు. వారి రాకతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. లోకేష్ని చూసేందుకు మహిళలు, యువత, వృద్దులు భారీగా రోడ్లపైకి వచ్చారు. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యల గురించి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు వింటూ అందరితో ఫోటోలు దిగారు లోకేష్. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలులో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేస్తాం అని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు లోకేశ్. యువగళం పాదయాత్ర 93వ రోజు కర్నూలులో సాగుతోంది. సోమవారం ఉదయం ఎస్టీబీసీ గ్రౌండ్ గెస్ట్ హౌజ్ నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. కర్నూలులోని జిల్లా కోర్టు భవనం వద్దకు పాదయాత్ర చేరుకోగా.. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ

02



## సోనియాగాంధీ పై ఎన్నికల కమిషన్ కు బిజెపి పిర్యాదు

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ కన్నెర్ర చేసింది. సోనియాగాంధీ తన ప్రసంగంలో 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం తెలిపిన బీజేపీ ఎంపీలు ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఈసీఐని బీజేపీ ప్రతినిధి బృందం కోరింది.కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ 6.5 కోట్ల కన్నడిగులకు బలమైన సందేశం ఇచ్చారని,

02

## పెను తుపానుగా మారబోతున్న మోచా

**ప్రజా తపన ,విశాఖపట్నం**



అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో ఏర్పడిన అల్పపీడం ఇవాళ సాయంత్రానికి వాయుగుండంగా మారుబోతోంది. రేపటికి తీవ్ర వాయుగుండంగా మారుతుంది. అనంతరం తుపానుగా మారి మయన్మార్ వైపు దూసుకెళ్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడబోతున్న తుపాను ఉత్తర దిశగా కదులుతోంది. మయన్మార్ వైపు దూసుకెళ్తున్నట్టు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అందుకే తెలుగు రాష్ట్రాలపై దీని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అభిప్రాయపడుతోంది.

ప్రస్తుతం అల్పపీడనంగా బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న వేళ తెలుగు రాష్ట్రాలకు అకాల వర్షం ముప్పు ఇంకా పొంచి ఉంది. మరోవైపు విండ్ డిస్కంటిన్యూటీ కూడా వర్షాలకు కారణమవుతోంది. రాయలసీమ జిల్లాలతోపాటు దక్షిణ తెలంగాణ, కోస్తాంధ్రలో పరిస్థితి ఇలానే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్లో రాయలసీమ జిల్లాలైన కడప, అనంతపురం, సత్యసాయి జిల్లా, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు వర్షాల దంచి కొట్టనున్నాయి. తొమ్మిదో తేదీ వరకు ఇలాంటి పరిస్థితే ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. కోస్తాలో కూడా కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడబోతున్నాయి. తెలంగాణలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. 9 తేదీ రాత్రి వరకు చాలా ప్రాంతాల్లో వర్షాలు పడనున్నాయి. హైదరాబాద్, వికారబాద్, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, నల్గొండ, సూర్యపేట, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, జయశంకర్ భూపాల్పల్లి, నారాయణ పేట, జోగులాంబ, ఆదిలాబాద్, అశ్వరారావుపేటలో వర్షాలు పడనున్నాయి. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడనున్నాయి. అందుకే ప్రజలంతా అప్రమతంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్

02

# తెలుగు బుక్ అఫ్ రికార్డు లో స్థానం సంపాదించిన ఏ యూ తెలుగు విద్యార్థి రాణా ప్రతాప్

**ప్రజా తపన, వైజాగ్**



ఆంధ్ర విశ్వకళాపరిషత్ ,తెలుగు విభాగం యం ఏ తెలుగు మొదటి సంవత్సరం చదువుతున్న ఐ రాణాప్రతాప్ తెలుగు బుక్ అఫ్ రికార్డు లో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్ పఠాన్ చెరువు లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాలలో భాగంగా శతాధిక కవిసమ్మేళనం లో పాల్గొని "అమ్మ నా మాతృభాష" అనే కవిత వినిపించినందుకు గాను రాణాప్రతాప్ ను జాతీయ సాహిత్య పురస్కారం,ప్రశంసా పత్రం,జ్ఞాపికతో పాటు కవి శ్రేష్ఠ బిరుదును ప్రదానం చేసినట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలియజేసారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అధ్యాపకులు, విద్యార్థులు యువకవి రాణాప్రతాప్ కు అభినందనలు తెలియజేసారు.

# తెదేపా అధికారంలోకి రాగానే కర్నూలులో హైకోర్టు బెంచ్

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా మాట్లాడిన నారా లోకేశ్.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాదిరి తాము మాట మార్చమని, మడమ తిప్పే బ్యాచ్ కాదని అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ కచ్చితంగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే బెంచ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్న లోకేశ్ హామీపై న్యాయవాదులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.
ఇన్కంట్యాక్స్ ఆఫీసు సర్కిల్, మున్సిపల్ ఆఫీస్, శ్రీలక్ష్మి స్కూల్ జంక్షన్, కొత్తపేట, జిల్లా కోర్టు, కొండారెడ్డి బురుజు, అంబేద్కర్ సర్కిల్, పెద్ద మార్కెట్ మీదుగా పాదయాత్ర సాగుతుందీ యాత్ర. చిన్నమ్మ వారిశాల వైశ్యులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మండీ బజార్, కుబూసూరత్ మసీదు, దర్వేష్ ఖాద్రి దర్గా మీదుగా ఉస్మానియా కాలేజ్ గ్రౌండ్ వరకు పాదయాత్ర సాగుతుంది. ఆ తర్వాత లంచ్ బ్రేక్ తీసుకుంటారు. విరామం తర్వాత సాయంత్రం ఉమర్ అరబిక్ స్కూలు, బుధవారపేట, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, కాళికామాత ఆలయం, కుమ్మరిగేరి, నిమిషాంబ ఆలయం, జోహారాపురం మీదుగా పుల్లయ్య కళాశాల వరకు పాదయాత్ర సాగుతుంది. ఆ తర్వాత కాలేజ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన విడిది కేంద్రంలో బస చేస్తారు.

# సోనియాగాంధీ పై ఎన్నికల కమిషన్ కు బిజెపి పిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

కర్ణాటక ప్రతిష్ట, సార్వభౌమాధికారం, సమగ్రతకు ముప్పుగా పరిణమించే ఎవరినీ కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించదని కాంగ్రెస్ పార్టీ మే 6న ఒక ట్వీట్ చేసింది. ఈ వ్యాఖ్యలపై బీజేపీతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. సోనియాగాంధీ 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే వాడినట్టు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ విమర్శించారు. ఆమెపై ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ శోభా కరంద్లాజే సైతం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సార్వభౌమాధికారం పదాన్ని దేశానికి మాత్రమే ఉపయోగిస్తారని, సోనియాగాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు భూపేంద్ర యాదవ్ సారథ్యంలోని బీజేపీ ప్రతినిధుల బృందం ఎన్నికల సంఘాన్ని ఆదివారంనాడు కలిసింది. జితేంద్ర ప్రసాద్, తరుణ్ చుగ్, అనిల్ బలూని, ఓం పాఠక్‌లు ఈ ప్రతినిధుల బృందంలో ఉన్నారు.కాగా, మైసూరు జిల్లాలో ఆదివారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి మోదీ సైతం కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'టుక్డే-టుక్డే గ్యాంగ్' జబ్బు ఇప్పుడు కాంగ్రెస్ అత్యున్నత స్థాయికి కూడా చేరిందని విమర్శించారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేసే విధంగా కాంగ్రెస్ 'రాయల్ ఫ్యామిలీ' ఎప్పుడూ ముందే ఉంటుందని, ఇలాంటి ఆటలను దేశం ఎప్పటికీ క్షమించదని అన్నారు. దేశంలోని రాజకీయాలను శాసిస్తున్న కాంగ్రెస్ రాయల్ ఫ్యామిలీ, విదేశీ శక్తుల జోక్యాన్ని కూడా కోరుతోందంటూ ఘాటు విమర్శలు చేశారు. ఇండియాను ద్వేషించే విదేశీ దౌత్యవేత్తలను కాంగ్రెస్ రహస్యంగా కలుసుకుంటోందని, దేశ సార్వభౌమాధికారానికి తలవంపులు తెచ్చే పనులకు మళ్లీ మళ్లీ పాల్పడుతోందని తూర్పారబట్టారు.

# పెను తుపానుగా మారబోతున్న మోచా

(మొదటిపేజీ తరువాయి)

వెదర్ మ్యాన్ తెలియజేశారు.
మోచా తుపాను బలమైన అల్పపీడనంగా ఉందని... 9వ తేదీ నాటికి తీవ్ర వాయుగుండంగా మారుతుంది. 10 తేదీ నాటికి తుపానుగా మారే అవకాశం ఉంది. 11, 12 నాటికి తీవ్ర తుపానుగా మారుతుంది. దీని ప్రభావం అండమాన్ నికోబార్పై ఎక్కువగా ఉంటుంది. అయితే తుపానుగా మారే నాటికి మయన్మార్ వైపు వెళ్లిపోనుందీ మోచా. 14వ తేదీ నాటికి అతి పెను తుపానుగా మారుబోతోంది. తుపాను ఈ వారంలో పశ్చిమ బెంగాల్కు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ బెంగాల్పై ప్రభావం చూపే అవకాశం ఉంది.
11వ తేదీ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి దారుణంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వెదర్ మ్యాన్ చెప్పారు. 10 వతేదీ నాటికి వర్షాలు తగ్గుముఖం పడతాయని చెప్పారు. 11 తర్వాత విపరీతమైన వడగాల్పులు ప్రజలను ఊపిరి ఆడనీయకుండా చేస్తాయట.
థార్ ఎడారి నుంచి వచ్చే గాలులు ప్రభావం తెలుగు రాష్ట్రాలపై విపరీతంగా ఉండబోతోంది. దీని వల్ల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోనున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే ఛాన్స్ ఉంది. ఐఎండీ హెచ్చరికతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. 'మోచా' తుపానుకు సంబంధించి ఒడిశాలోని 18 జిల్లాల్లో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తుపాను, పిడుగుల హెచ్చరికలతో 9 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# నిరుపేదల ఆకలి తీర్చడమే సేవాదళ్ లక్ష్యం

**కోరుట్ల,**



నిరుపేదల ఆకలి తీర్చడమే కోరుట్ల సేవాదళ్ లక్ష్యం అని సేవాదళ్ అధ్యక్షులు పుప్పాల నాగరాజ్ పేర్కొన్నారు.. పట్టణంలోని 24 వార్డుకు చెందిన దారిశెట్టి రంజిత్ రెండో సంవత్సరికం సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల సేవాదళ్ అధ్యక్షులు పుప్పాల నాగరాజ్ మాట్లాడుతూ ఆకలితో అలమటిస్తున్ననిరుపేదల ఆకలి తీర్చడమే కోరుట్ల సేవాదళ్ లక్ష్యం ఆని అన్నారు...తమకు తోచిన సాయం అందించి పేద వాళ్లకు అండగా నిల్వాలన్నారు.. యువతసామాజిక సేవ చేసి సహాయ సహకారము అందించాలన్నారు.. దారిశెట్టి రంజిత్ ఆత్మకు శాంతి చేకూరాలని సేవాదళ్ సభ్యులు కోరినట్లు వారు తెలిపారు..ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు సోహెల్, కండ్లి భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ ప్రాజెక్టుతో నష్టమే లేదు

**జగిత్యాల**




ఇథనాల్ ప్రాజెక్టుతో ఎలాంటి నష్టం లేదని ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ లబ్ధికోసం ప్రజలను రెచ్చగోడుతున్నారని, ఇథనాల్ ప్రాజెక్టుతో నష్టముంటే ఆధారాలతో రావాలని ఎక్కడైనా చర్చకు సిద్ధమని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. సోమవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించని ఇథనాల్ ప్రాజెక్టు పూర్తి బయో ఇథనాల్ ప్రాజెక్టు అని అన్నారు. కోటి మంది రైతుల భాగస్వామ్యంతో నడిచే క్రిబ్ కో కంపెనీలో పదివేల సహకార సంఘాలు కలుపుకొని పనిచేస్తున్నదని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటుతో రైతులకు మేలు తప్ప ఎటువంటి నష్టం లేదని కానీ ప్రతిపక్ష పార్టీల నేతలు లేనిపోనివి చెప్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇథనాల్ ప్రాజెక్టు తేవడంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ కృషి వెలకట్టలేనిదని శ్రీకాంత్ రెడ్డి కొనియాడారు. ప్రాజెక్టు రావడం నచ్చని బబీజేపీ, కాంగ్రెస్ నేతలు ప్రజలను రెచ్చగొట్టి ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్నారని దీనితో ఎవరికి ఎలాంటి నష్టం లేదన్నారు. దేశంలో మూడు ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో గుజరాత్ లో ఒకటి ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు కృష్ణపట్నం, మూడవది ధర్మపురి నియోజకవర్గంలోనని చెప్పారు. కేంద్రమే పెట్రోల్ లో 10 శాతం ఇతనాల్ కలపాలని సూచిస్తోందని ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని శ్రీకాంత్ రెడ్డి చెప్పారు. అలాగే రైతుల పంట దిగుబడులను మద్దతు ధరకు కొనుగోలు చేయవచ్చని, తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తారని చెప్పారు. అనంతరం ఫ్యాక్స్ చైర్మన్ ల ఫోరమ్ అధ్యక్షుడు రాజ సుమన్ రావు మాట్లాడుతూ తెలిసి తెలియకుండా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే నవ్వొస్తుందన్నారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తన చిల్లర రాజకీయాలు తెరలేపాడని సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి కూడా రాజకీయ లబ్ధికోసం అసత్య ప్రచారాలకు తెరలేపాడన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో నీరు, వాయు కలుషితమైతదని రోగాలు వస్తాయని ప్రజలకు లేనిపోనివి చెప్పి రెచ్చగొట్టడం సరికాదన్నారు. ప్రాజెక్టులు రావాలని కోరుకోవాల్సిన ప్రతిపక్ష నేతలు వచ్చిన ప్రాజెక్టు ను వేరే చోటకు తరలించాలని జీవన్ రెడ్డి మాట్లాడడం తగదన్నారు. నిజాలను ప్రజలకు చెప్పాలే అసత్యాలు ప్రజలకు చెప్పి ప్రజలకు నష్టం కలిగించొద్దన్నారు. పాశిగాం పూర్తిగా ఎస్సీ గ్రామమని ఇక్కడ పరిశ్రమ పెడితే ఎంతో లాభమని భావించిన మంత్రి ఈశ్వర్ పూర్తి ప్రభుత్వ భూమిలో గుట్టలలో ప్రాజెక్టు నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేశారన్నారు. ఈ స్థల పరిశీలన కోసం వచ్చిన సంస్థ బోర్డ్ సభ్యుల్లో పొన్నం ప్రభాకర్ ఒకరని రాజా సుమన్ రావు చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాజకీయం సమాప్తం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి ఈశ్వర్ కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ నాయకుల కుట్రలన్నారు. ధాన్యం కొనుగోళ్లు ఎప్పటికప్పుడు జరిగేలా చేస్తుంటే దానిమీద విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇతనాల్ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు బయటకు రాకుండా బాబిలింగ్ చేస్తారని, ఇది కెమికల్ ఫ్యాక్టరీ కాదని రాజ సుమన్ రావు చెప్పారు. ప్రాజెక్టు వల్ల ప్రజలకు లాభాలను చెప్పడానికి మేము నష్టాలను చెప్పడానికి కాంగ్రెస్ నాయకులు అడ్లూరి, జీవన్ రెడ్డిలు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చర్చకు ఎక్కడికైనా రావడానికి సిద్ధమేనని తోకముడిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రతిపక్షాల నేతల డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని రాజ సుమన్ రావు హెచ్చరించారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దొంగలెక్కలు ప్రజలకు తెలిసిపోయాయని ప్రజలను రెచ్చగొట్టే పనులు మానుకోవాలని లేకుంటే తగిన గుణపాఠం చెప్తామని రాజ సుమన్ రావు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఫ్యాక్స్ ఛైర్మన్ లు మహిపాల్ రెడ్డి, సౌళ్ల నరేష్, గందె వెంకట మాధవరావు, మంత్రి వేణు, ఏనుగు మల్లారెడ్డి, బోయినపల్లి మధు

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

**జగిత్యాల:**



బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అధికారులకు ఆదేశించారు..ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 32 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ రోజు వచ్చిన ఫిర్యాదులు భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్, గల్ఫ్ కు పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన సమస్యల పైన ఫిర్యాదులు రావడం జరిగిందని అధికారులు తెలిపారు.అలాగే కోడిమ్యాల మండలానికి చెందిన ఒక వ్యక్తి 9 మందిని మలేషియా కు పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన విషయంలో విచారణ జరిపి కేసు నమోదు చేయాల్సిందిగా మల్యాల సి.ఐ రమణమూర్తిని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# మల్లికార్జున రిజర్వాయర్ మాకొద్దు

**మిడుతూర్**



నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజవర్గం లోని మండల కేంద్రమైన మిడుతూరులో రైతులు తలపెట్టిన మల్లికార్జున రిజర్వాయర్ మాకొద్దని ...మా పొలాలు మాకే కావాలంటూ మండలంలోని చింతలపల్లె, దేవనూరు, గుడిపాడు, సున్నంపల్లి గ్రామాలకు చెందిన రైతులు సోమవారం మిడుతూరు తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కృష్ణానది మిగులు జలాల నుండి త్రాగునీరు, సాగునీరు అందించేందుకై ఉమ్మడి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల తోపాటు కడప జిల్లాకు నీటిని తరలించేందుకై మిడుతూరు మండలంలో 15.7 టీఎంసీల నీటి సామర్థ్యంతో దేవనూరు వద్ద ఏర్పాటు చేయ తలపెట్టిన మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణంతో దేవనూరు సున్నంపల్లి గ్రామాలను ఎత్తి కట్టడంతోపాటు విలువైన సారవంతమైన భూములు తాము కోల్పోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం డీపీఆర్ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని పత్రికల్లో వార్తా కథనాలు రావడం జరిగింది అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం వల్ల మిడుతూరు మండల రైతాంగానికి పూర్తిగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అయితే పాణ్యం నియోజవర్గ అధికార పార్టీ ఎమ్మెల్యే తన స్వార్థం కోసం రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వంతో పట్టు పడడం సరైనది కాదని తనకు అంతగా ప్రేమ ఉంటే తన సొంత పొలాల్లో తన నియోజకవర్గంలోనే రిజర్వాయర్ నిర్మాణం ఏర్పాటు చేసుకోవాలని రైతులు మండిపడ్డారు. నందికొట్కూరు నియోజవర్గంలో నీ పెత్తనం ఏమిటని కాటసానిపై రైతులు మడిపడ్డారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరు మండలానికి ఇంత అన్యాయం జరుగుతున్నప్పటికీ మాట్లాడే నాయకుడు నియోజవర్గంలో లేడా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందికొట్కూరు నియోజకవర్గం నుండి నీటిని ఇతర జిల్లాలకు తరలించడం తప్ప నియోజవర్గానికి ఒరిగేది ఏమీ లేదని గత అనుభవాలు శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం, హంద్రీనీవా ,ముచ్చుమరి ఎత్తిపోతల పథకం కింద నష్టపోయిన రైతుల అనుభవాలే తమకు మిగులుతాయనే భయాందోళన రైతులు వ్యక్తం చేశారు. వారి జీవితాల లాగానే తమ జీవితాలను నాశనం చేయవద్దని ప్రభుత్వాన్ని విన్నవించుకున్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ సిరాజుద్దీన్ కు వినతి పత్రం రైతులు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మల్లికార్జున నిర్మాణం పై తమకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని మీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# చైన్ స్నాచింగ్‌లో కొత్త స్టైల్

**అనంతపురం:**

ఇంటింటికి తిరిగి పాలు పోసే యువకుడి క్రైమ్ కహానీ బయటపడింది. పాల పోస్తున్న ఇంటికే కన్నం వేశాడు. కానీ సీన్ రివర్స్ కావడంతో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. అనంతపురం జిల్లా ఉరవకొండ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో అపార్ట్‌మెంట్‌లో టీచర్లు ప్రసాద్, ఉషారాణి దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 20న ఇంటికి తాళం వేసి ఇద్దరు విధులకు వెళ్లారు.. తిరిగొచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగింది. ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేశారు. ఆ అపార్ట్‌మెంటుకు వెళ్లే దారిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. అనుమానాస్పదంగా కదలికలు ఉండటంతో గుంతకల్లుకు వెళ్లే రోడ్డులో నివాసం ఉండే పాల వ్యాపారి ఎర్రిస్వామిని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని ప్రశ్నిస్తే.. దొంగతనం డొంక మొత్తం కదిలింది. అతడి వేలి ముద్రలు సేకరించి పోల్చి చూడగా అతడే చోరా చేశాడని తేలింది. అతడు గతంలో మరో టీచర్ విజయ లక్ష్మి, విద్యుత్తు శాఖ కాంట్రాక్టర్ నాగలింగ స్వామి ఇళ్లలో కూడా చోరీలు చేసినట్లు గుర్తించారు. అక్కడ దొంగతనం చేసినట్లు అతడి వేలి ముద్రల ద్వారా తేలింది. ఈ మూడు చోరీ కేసులకు సంబంధించి.. మొత్తం 21 తులాల బంగారు ఆభరణాలు, 62 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.2.48 లక్షల డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.14.49 లక్షలు అని పోలీసులు చెబుతున్నారు. ఎర్రిస్వామి చోరీ చేసిన సొత్తును అమ్మి ఆవులను, కెమెరా కొనుగోలు చేయాలని ప్లాన్ చేసుకున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయంలో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నిందితుడిని ఉరవకొండ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అతడు ఉదయం సమయంలో పాల వ్యాపారం చేస్తూ.. ఆ తర్వాత ప్లాన్ చేసి పాలు పోసే ఇళ్లలోనే చోరీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో కేసులో ఏడునెలల బాలుడిని మంత్రాలయంలో అపహరించి గుంతకల్లులో విక్రయించిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం కాంచాపురంకు ఆంజనేయులు, అంకమ్మలు భార్యాభర్తలు. ఇద్దరు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆంజనేయులు కుటుంబంతో కలిసి మంత్రాలయం రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తుండగా.. వారి కుమారుడ్ని నిందితులు అపహరించారు. అక్కడి నుంచి తీసుకెళ్లి గుంతకల్లులో వలిబాషకు రూ.3 లక్షలకు అమ్మేశారు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు నిందితుల కోసం గాలించి చివరికి అరెస్ట్ చేశారు.

# తెలంగాణలో అలా-ఏపీలో ఇలా

**విజయవాడ :**

ఎండా కాలం వానలు తెలుగు రాష్ట్రాల్లో రైతుల్ని నిండా ముంచేశాయి. ఆరబెట్టుకున్న ధాన్యం నీళ్ల పాలయింది. కోతకు పంట నాశనం అయింది. ఎలా చూసినా రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానంలో స్పష్టంగా తేడా కనిపిస్తోంది. తెలంగాణ మంత్రులు దాదాపుగా అన్ని జిల్లాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం కూడా స్పందించింది. కానీ ఏపీ ప్రభుత్వంలో మాత్రం పెద్దగా కదలిక ఉండటం లేదు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాటలు నిరాశావాదంతో ఉంటున్నాయి. అధికారులు కూడా రైతుల్ని ఆదుకుంటామని భరోసా ఇవ్వలేకపోతున్నారు. కనీసం నష్టపరిహారం ఎంత ఇస్తామన్నది కూడా చెప్పలేదు. దీంతో ఏపీ రైతుల్లో దిగులు కనిపిస్తోంది. తెలంగాణలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. పదివేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిజానికి ఈ పరిహారాన్ని సీఎం కేసీఆర్ మూడు వారాల కిందట భారీగా వడగళ్ల వాన వచ్చినప్పుడే ప్రకటించారు. కానీ ఇప్పుడు మరిన్ని వర్షాలు ఎక్కువగా పడ్డాయి. మరి కొన్ని లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ధాన్యం తడిచిపోయింది. అందుకే అందరికీ పన్నెండో తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రైతుకు జరిగి నష్టం రూ. పదివేలుతో పూడిపోదు. కానీ..ప్రభుత్వం ఎంతో కొంత ఆదుకుందన్న భరోసా దక్కుతుంది. అలాగే తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని భరోసా కల్పిస్తున్నారు. అదే సమయంలో ఏపీలో ఇప్పటి వరకూ పంట నష్టపోయిన రైతులకు ఇతమిత్థంగా ఇంత ఇస్తామన్న ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి రాలేదు. పరిహారం అందలేదని ఒక్క రైతు కూడా చెప్పలేదని వారి మొహంలో చిరునవ్వు కనిపించేలా అందరికీ పరిహారం ఇవ్వాలని సీఎం జగన్ సమీక్షలో ఆదేశించారు. కానీ ఎంత ఇవ్వాలి.. ఎప్పుడు ఇవ్వాలన్నదానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ఎవరైనా అండగా ఉంటే ఉండే ధైర్యం వేరు. అందుకే ఏదైనా విపత్తు జరగగానే తామున్నామంటూ ప్రభుత్వానికి చెందిన వారు వెళ్తారు. బాధితుల్లో భరోసా కల్పిస్తారు. తెలంగాణ ప్రభుత్వ మంత్రులు అదే చేశారు. కేటీఆర్ సహా వర్ష ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులందరూ రైతుల్ని పరామర్శించారు. తమది రైతు ప్రభుత్వమని ఖచ్చితంగా ఆదుకుంటామని. .తడిచిన ధాన్యాన్ని కొంటామని భరోసా ఇచ్చారు. ఇది ఓ రకంగా తెలంగాణ రైతులకు నైతిక స్థైర్యం ఇచ్చింది. అయితే ఏపీలో మాత్రం ఏ ఒక్క మంత్రి రైతుల్ని పరామర్శించేందుకు ఆసక్తి చూపించడం లేదు. రైతులు సంతోషంగా ఉన్నారనే ప్రకటనలు చేస్తూ ఉంటారు కానీ.. వర్ష ప్రభావిత ప్రాంతాల్లోని రైతులను చూస్తే ఎవరికైనా కడుపు తరుక్కుపోతుంది. చేతికి వచ్చిన పంట పాడైపోయింది. చేతికి రావాల్సిన పంట వస్తుందన్న గ్యారంటీలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి ధైర్యం చెప్పడానికి కూడా ఎవరూ రాలేదు. అదే సమయంలో ప్రెస్ మీట్ పెట్టిన అధికారులు .. సాయం చేయలేమని కావాలంటే సలహాలిస్తామని ప్రకటించడం వివాదాస్పదమయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సమస్యల్లో ఉంది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఉద్యోగులకు జీతాలు, రిటైరైన ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వలేకపోయారు. రిజర్వ్ బ్యాంక్ వద్ద ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని వాడుకుని రోజువారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రకృతి విపత్తులకు ప్రజలకు సాయం చేయడానికి ఆర్థిక సమస్యలు ఉండటం వల్లనే చురుకుగా కదలడం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఉంటే.. వేల మంది రైతులు నష్టాన్ని తప్పించుకునేవారనే వాదన ఉంది. ప్రభుత్వం ఆర్థికం కాకపోయినా.. సమయానుకూలంగా చురుకుగా వ్యవహరిస్తే.. ఎంతో నష్టం తగ్గి ఉండేదని రైతులు అంటున్నారు. కారణం ఏదైనా తెలంగాణతో పోలిస్తే ఏపీ రైతులు ఎక్కువగా నష్టపోయారు. కానీ ప్రభుత్వం మత్రం అనుకున్న విధంగా చురుకుగా స్పందించలేకపోతోంది. ఇది రైతుల్లో ప్రభుత్వంపై ఆగ్రహానికి కారణం అవుతోంది. అటు మంత్రులు.. అటు యంత్రాంగం మొత్తం అకాల వర్షాల వల్ల జరిగిన నష్టంపై యాంత్రికంగా వ్యవహరించడంతో రైతులకష్టాలు మరింత పెరుగుతున్నాయి.

# తెలుగు నేతల హడావిడి

**బెంగళూరు:**

కర్ణాటక ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కొంత మంది సినీ నటులు కూడా ప్రచారం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలు బెంగళూరులోనే మకాం వేశారు. తెలంగాణ బీజేపీ ముఖ్య నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బెంగళూరులో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఏపీ నుంచి ఆ పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి కూడా పర్యటిస్తున్నారు. తెలుగు కమ్యూనిటీలతో సమావేశాలు నిర్వహిస్తూ బీజేపీకే మద్దతివ్వాలని కోరుతున్నారు. ఉత్తర కర్ణాటకలోని చిక్ బళ్లాపూర్, హోసూర్, కోలార్, బీదర్, గంగావతి, రాయచూర్, కొప్పోల్, గుల్బర్గా, వంటి చాలా ప్రాంతాల్లో తెలుగు వారే ఎక్కువగా ఉన్నారు. అక్కడ చాలా మంది కన్నడ వారు కూడా తెలుగు మాట్లాడగలరు. అందువల్ల సరిహద్దు ప్రాంతాల్లో తెలుగు రాష్ట్రాల నేతలు ప్రచారానికి వెళ్తున్నారు. రెండు రోజుల్లో ప్రచారం ముగుస్తుంది. అందుకే కీలక నేతలంతా అక్కడే మకాం వేశారు. ఏపీ బీజేపీ నేత విష్ణువర్దన్ రెడ్డి ప్రచారం ప్రారంభమయినప్పటి నుండి అక్కడే ఉన్నారు. ప్రధాని మోదీ పర్యటనల్లో ఆయన బాధ్యతలు నిర్వహించారు. సోము వీర్రాజు సహా పలువురు నేతలు కర్ణాటకలో ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి... కర్ణాటక కాంగ్రెస్ నేత శివకుమార్‌తో కలిసి ప్రచారం, ర్యాలీల్లో పాల్గొంటున్నారు. బీజేపీ తరపున బ్రహ్మానందం చిక్ బళ్లాపూర్‌లో ప్రచారం చేశారు. చిక్కబళ్లాపుర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సుధాకర్ కు మద్దతుగా ప్రచారం చేశారు. సుధాకర్ ఎంతో మంచివాడని.. ఆయన చేసిన మంచి పనులను గుర్తు పెట్టుకుని ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బ్రహ్మానందం సినిమా డైలాగ్ చెప్పి అలరించారు. ఖాన్స్ తో గేమ్స్ ఆడొద్దు శాల్తీలు లేచిపోతయ్ అని అనడంతో ఫ్యాన్స్ ఈలలు వేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ అదేమీ లేదని తేలిపోయింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు మే 10 న జరగనుండగా, మే 13న ఫలితాలు విడుదల కానున్నాయి. పోటీ ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఉండనుంది. కాగా రాజకీయ పార్టీలు ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటూ రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

# ఈ సారి అంత ఈజీ కాదా...

**హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీని టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి తొలిసారి ఎన్నికలకు వెళుతున్నారు. ఈ ఏడాది అక్టోబరులోనే తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయని ఆయనే ఎమ్మెల్యేలకు తెలిపారు. డిసెంబరు వరకూ సమయం ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల కమిషన్ అక్టోబరులో నిర్వహించే అవకాశముందని ఆయన అంచనా వేస్తున్నారు. అంటే ఆగస్టులో తెలంగాణ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుంది. అంటే కేసీఆర్ లెక్క ప్రకారమే ఇంకో మూడు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అయితే ఇప్పటి వరకూ కేసీఆర్ దేశ రాజకీయాలు తప్పించి రాష్ట్ర రాజకీయాలపై పెద్దగా ఫోకస్ పెట్టలేదనే చెప్పాలి. హైదరాబాద్‌లో మాత్రం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అంతే తప్ప ఆయన జిల్లాల్లో తిరిగింది లేదు. మరోవైపు అనేక సమస్యలు ఈసారి ఎన్నికల్లో కేసీఆర్ చూడాల్సి వస్తుంది. బీజేపీ బలపడి కాంగ్రెస్ ఓట్లు చీల్చుకుంటే తన గెలుపు మూడోసారి సులువని లెక్కలు వేసుకుంటున్నారు. అయితే అది సాధ్యమా? ఆయన హామీలు ఎంత వరకూ నెరవేరాయన్నది పెద్దయెత్తున ప్రజల్లో చర్చ జరుగుతుంది. కేసీఆర్ అంచనా వేసినట్లుగా ఏ వర్గమూ సంతృప్తికరంగా లేవని పలు సంస్థల సర్వేల్లో వెల్లడవుతుంది. అయితే ఈ అసంతృప్తి కేసీఆర్ గెలుపుపై ఎంత ప్రభావం చూపుతుందన్న విషయం పక్కన పెడితే ఈ ఎన్నికలు కేసీఆర్‌కు అంత కష్టం కాదన్నది కాదనలేని వాస్తవం. రైతులకు పెట్టుబడి సాయం ఇస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్ అదే సమయంలో రుణమాఫీ విషయంలో చేతులెత్తేశారు. గత ఎన్నికలకు ముందు లక్ష రూపాయల రైతు రుణ మాఫీ చేస్తానన్న కేసీఆర్ హామీ నెరవేరలేదు. ఇప్పటికీ పాతిక వేల రూపాయల లోపు రుణం పొందిన వారికే రుణ మాఫీ చేయగలిగారు. ఇంకా దాదాపు 30 లక్ష మంది రైతులకు రుణ మాఫీ చేయాల్సి ఉందని చెబుతున్నారు. వీరంతా కేసీఆర్ సర్కార్‌పై అసంతృప్తితోనే ఉన్నారని తెలుస్తోంది. అలాగే పోయిన సారి వచ్చిన వరదలకే పంట నష్టం చెల్లించలేదు. ఇక ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇక సాయం అందుతున్న నమ్మకమూ లేదు. ఆయన ఆదేశాలు వచ్చే లోపు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని వాపోతున్నారు రైతులు. రైతాంగం నీరు తమ పొలాలకు అందుతున్నాయని ఆనంద పడలా? లేక నష్టపోయిన పంటను చూసి ఏడ్వాలా? కూడా తెలియడం లేదు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితుల ఓట్లన్నీ గంపగుత్తగా పడే అవకాశమైతే లేదు. వాహనాలు ఆగిపోయిన ఘటన భారత్ లో చోటు చేసుకోలేదు దళిత బంధు దళిత బంధు పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి పది లక్షల రూపాయలను ఇస్తానని ప్రకటించారు. బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించారు. కానీ పంపిణీ చేయాలంటే పైసలు లేవు. జీతాలకే వెతుక్కోవాల్సిన పరిస్థితి. కేంద్రంతో కొట్లాట కారణంగా ఆ సర్కార్ అప్పులకు రెడ్ సిగ్నల్ చెబుతుంది. ఇలా కేసీఆర్ దళిత బంధు పథకం హామీ ఎన్నికలు వచ్చే లోపు నెరవేరదనే చెప్పాలి. అయినా దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు సూచించిన వారికే కొందరికి ఇస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దళితుల్లోనే ఎక్కువ మంది అసంతృప్తిగా ఉన్నారని పలు సంస్థలు జరిపిన సర్వేల్లో వెల్లడవుతుంది. హుజూరాబాద్‌లో దళిత బంధు పథకం అమలు చేసినా కొందరికే దక్కడంతో మిగిలిన వారు ఈటలవైపే మొగ్గు చూపిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా రాష్ట్రంలోని దళితులందరికీ ఎన్నికలలోపు ఆ పథకాన్ని వర్తింప చేయడం కేసీఆర్ వల్ల కాదు. దీంతో ఆ వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమవ్వడం ఖాయమంటున్నారు విశ్లేషకులు. డబుల్ బెడ్ రూం ఇళ్లు కూడా కేసీఆర్ సర్కార్‌కు ఇబ్బందికరంగా మారనున్నాయి. కొందరికే అవి దక్కడంతో ఎక్కువ మంది అసంతృప్తికి గురవుతున్నారు. ఈ పథకంలో కూడా ఎమ్మెల్యేలు ఎంపిక చేసిన వారికే ప్రాధాన్యత ఇవ్వడం ఇబ్బందికరంగా మారింది. అర్హులైన వారికి కాకుండా అనుయాయులకే ఎమ్మెల్యేలు కట్టబెడుతున్నారన్న విమర్శలున్నాయి. ఇక విద్యార్థులు, నిరుద్యోగులు కూడా కేసీఆర్ పాలన పట్ల సంతృప్తికరంగా లేరన్నది వాస్తవం. నోటిఫికేషన్లు విడుదలయినా పోస్టులు భర్తీ చేయలేకపోవడం, ప్రశ్నాపత్రాల లీకేజీ వంటివి కేసీఆర్ పాలనపై అసంతృప్తిని మరింత పెంచిందంటున్నారు. తొమ్మిదేళ్ల పాలన చూసిన ప్రజలు కూడా కేసీఆర్ పాలనపై విసుగెత్తి ఉన్నారని పలు సర్వేల్లో ఇప్పటికే వెల్లడయింది. నోటిఫికేషన్ వెలువడితే ఇక చేయడానికి ఏమీ ఉండదు. కేసీఆర్ కేబినెట్ లోని మంత్రుల్లో ఎక్కువ మంది ఈసారి గెలిచే అవకాశం లేదన్న వార్తలు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. డబ్బు అన్ని రోజులూ పనిచేయదు. తెలంగాణలో అస్సలు అది వర్క్ అవుట్ కాదు. ప్రజలు మార్పు కావాలని కోరుకుంటే కేసీఆర్‌కు జనం గుడ్‌బై? చెప్పడం ఖాయ మంటున్నారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి ఉండవచ్చు. అయితే ఆ జమానా వేరు. ఇప్పుడు జనరేషన్ వేరు. యువతలో కొంత మార్పు వచ్చిందన్నది విశ్లేషకుల అంచనా. మరి వీటన్నింటి నుంచి కేసీఆర్ తనదైన వ్యూహంతో ఎలా బయటపడతారన్నది ఆసక్తికరమైన అంశమే.

# సరిహద్దు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి

**బెంగళూరు:**

కర్ణాటక ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ పేరుతో జరిగే డబ్బు, మద్యం పంపిణీలను అడ్డుకోవడానికి ఎన్నికల సంఘం సరిహద్దు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల సరిహద్దు రాష్ట్రాల సీఎస్, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తెలుగు రాష్ట్రాల పోలీసు యంత్రాంగం సరిహద్దు జిల్లాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. డబ్బు, మద్యం అక్రమ రవాణా జగరకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఏపీలో కర్నాటకకు ఆనుకుని చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లా, కర్నూలు, అన్నమయ్య, నంద్యాల జిల్లాలు ఉన్నాయి. సరిహద్దు జిల్లాల్లో పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచీ ఎన్నికల నిబంధనలు పూర్తి స్థాయిలో అమల్లోకి రానున్నాయి. సరిహద్దుకు 5 కిలోమీటర్ల పరిధిలో ఏపీలోని సరిహద్దు ప్రాంతాల్లో కఠిన ఆంక్షలు అమలు కానున్నాయి. ఓటర్లను ప్రలోబపరిచేందుకు మద్యం, నగదు, ఇతర బహుమతులు, సామాగ్రిని సరిహద్దు మార్గాల ద్వారా కర్నాటకకు వెళ్ళకుండా నియంత్రించేందుకు తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కర్నాటకలో పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి మద్యం నిషేధం ఉంటుంది. దీంతో ఏపీలోని సరిహద్దు ప్రాంతాల్లో కూడా అధికార యంత్రాగం మద్య నిషేధం అమలు చేయనుంది. కర్ణాటకతో ఏపీకే ఎక్కువ సరిహద్దు ఉంది. తెలంగాణలో జహీరాబాద్ వద్ద బీదర్ వంటి కర్ణాటక నియోజకవర్గాలు ఉన్నాయి. అందుకే అటు వైపు కూడా చెక్ పోస్టులు పెడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 50కిపైగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు తనిఖీలు, చెక్‌పోస్టుల ఏర్పాటుకు ఆస్కారం లేని చోట్ల నిరంతరం పెట్రోలింగ్ పార్టీలు సంచరిస్తున్నాయి. కర్నాటక నుంచి ఏపీ వైపు వచ్చే వాహనాలు, రాకపోకలపై ఎస్ఇబి దృష్టి పెట్టింది. ఏపీ నుంచి కర్నాటకలోకి ప్రవేశించే మార్గాల్లో రాకపోకలపై పోలీసు యంత్రాంగం తనిఖీల బాధ్యతను నిర్వహిస్తోంది. ఎన్నికలు ఎక్కడ జరిగినా బస్సుల్లో బోగస్ ఓటర్లు వెళ్లడం ప్రతీ సారి వివాదాస్పదంఅవుతోంది. ఏపీ సరిహద్దు జిల్లాల నుంచి వలస వెళ్ళిన అనేక మందికి అక్కడ, ఇక్కడ రెండు చోట్ల గుర్తింపు కార్డులు ఉన్నట్లుగా భావిస్తున్నారు. పోలింగ్ రోజున అల్లర్లు సృష్టించేందుకు, దొంగ ఓట్లు షురూ చేసేందుకు ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం సరిహద్దులో తల దాచుకునే అవకాశం ఉందని నిఘా వర్గాల సమాచారం. ఇలాంటి వారిని కట్టడి చేయనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రధానంగా యంత్రాంగం సరిహద్దులో నగదు, మద్యం రవాణాపైనే దృష్టి పెట్టింది.

# 14న తెలంగాణకు హిమంత బిశ్వశర్మ

**కరీంనగర్ :**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కరీంనగర్‌లో మరోసారి హిందూ ఏక్తా యాత్ర నిర్వహించనున్నారు. ఈ నెల 14న కరీంనగర్ లో నిర్వహించే "హిందూ ఏక్తా యాత్ర"కు ముఖ్య అతిధిగా అసోమ్ అఓ హిమంత బిశ్వ శర్మ హాజరు కానున్నరా?. హిమంత తోపాటు "హిందూ ఏక్తా యాత్ర"కు బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ చుగ్ కూడా హాజరు కానున్నారు. లక్ష మందితో "హిందూ ఏక్తా యాత్ర" నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ×"హిందూ ఏక్తా యాత్ర" ద్వారా హిందూ సంఘటిత శక్తిని చాటుతామని ×హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడే ప్రతి ఒక్కరూ ఈ యాత్రలో పాల్గొనాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. బండి సంజయ్ కరీంనగర్‌లో ప్రతీ ఏడాది హిందూ ఏక్తా యాత్ర నిర్వహిస్తూ ఉంటారు. ప్రతీ ఏడాది ఓ ముఖ్య అతిథిని ఆహ్వానిస్తారు. గత ఏడాది నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు వివాదం అయ్యాయి. మసీదులను తవ్వుదామని అసదుద్దీన్ ఓవైసీకి చాలెంజ్ చేశారు. తెలంగాణకు పట్టిన శని పీడను వదిలించి రామరాజ్యాన్ని స్థాపించి తీరుతామని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మదర్సాలను రద్దు చేస్తామని? మైనారిటీ రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు వర్తింపజేస్తామని ప్రకటించారు. అధికారిక భాషగా ఉన్న ఉర్దూను శాశ్వతంగా నిషేధిస్తామన్నారు. తెలంగాణకు పట్టిన శనిని కాషాయంతో కడిగేసి రామరాజ్యం స్థాపించి తీరుతామని ఉద్ఘాటించారు. ఢిల్లీకి రాజైనా ఎప్పటికీ నేను కరీంనగర్ బిడ్డనేనని? జిల్లా ప్రజలకు ఏ ఆపదొచ్చినా పెద్ద కొడుకుగా ఉంటూ ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కొనఊపిరి ఉన్నంత వరకు తెలంగాణలో హిందూ సమాజాన్ని సంఘటితం చేసేందుకు పోరాడుతూనే ఉంటానని చెప్పారు. కరీంనగర్ లో బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించే హిందూ ఏక్తా యాత్రకు వేలాది మంది ప్రజలు తరలివస్తూంటారు. కరీంనగర్ హిందు సమాజం నన్ను ఎంపీగా గెలిపించిందని.. తెలంగాణ రాష్ట్రంలో హిందూ సమాజాన్ని కాపాడాలంటూ నన్ను రాష్ట్రానికి పంపింది కరీంనగర్ ప్రజలేనని బండి సంజయ్ చెబుతూంటారు. .తెలంగాణ గడ్డను కాషాయ మయం చేస్తున్నా.తెలంగాణకు పట్టిన శనిని కాషాయంతో తుడిచేసి రాష్ట్రాన్ని పవిత్రం చేసే బాధ్యతను తీసుకున్నా? తప్పకుండా రామరాజ్యం రావాల్సిందేనని చెబుతూంటారు. కరీంనగర్ నడిబొడ్డున ఈద్గా పోవాలన్నా? వేములవాడలో దర్గా పోవాలంటే రామరాజ్యం రావాల్సిందేనని బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూంటారు. కరీంనగర్‌లో జరిగిన ఏక్తా యాత్రలో బండి సంజయ్ రాష్ట్రంలో రాక్షస రాజ్యాన్ని పాతరేస్తామని. రామరాజ్యాన్ని స్థాపించి తీరుతామని చెబుతూ ఉంటారు. కరీంనగర్ జిల్లా ప్రజల చలువతోనే రాష్ట్రంలో నాకు పేరొస్తుంది. రాబోయే రోజుల్లో వచ్చే ఫలితాలన్నీ మీ చలువే.. ఢిల్లీకి రాజైనా కరీంనగర్ కు నేను బిడ్డనే. కరీంనగర్ జిల్లా ప్రజలకు పెద్ద కొడుకుగా ఉంటా.. ఏ హిందువుకు కష్టమొచ్చినా హనుమంతుడి భక్తుడిగా ఛత్రపతి శివాజీ వారసుడిగా ఆదుకుంటా? నా చివరి రక్తపు బొట్టును సైతం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇస్తున్నారు. గత ఏడాదిలాగే ఈ సారి కూడా భారీగా యాత్ర నిర్వహించాలనే లక్ష్యంతో బండి సంజయ్ ఉన్నారు.

## ట్రాక్టర్ ను ఢీ కొన్న మారుతీ వ్యాన్

**నెల్లూరు**

నెల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఒడిస్సా కు చెందిన పదిమంది కూలీలు తిరుపతి నుంచి తమ ప్రాంతానికి మారుతీ వ్యాన్ లో వెళ్తుండగా నెల్లూరు సమీపంలోని భగత్ సింగ్ కాలనీ వద్ద జాతీయ రహదారిపై వ్యాన్ ట్రాక్టర్ ను ఢీ కొన్న ఘటనలో పలువురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించారు.

## అదుపు తప్పి లారీ బోల్తా

**ఒంగోలు**



ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఎడమకల్లు సమీపంలోని కడప అమరావతి రహదారిపై లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లి బోల్తా బడ్డ సంఘటన సోమవారం ఉదయం జరిగింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ఒంగోలు**



బేస్తవారిపేట పట్టణ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ఆటోలను కారు ఢీ కొట్టింది. ఘటనలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. అలుకు రంజాన్ స్వాన్(25) మృతి చెందాడు. మృతుడు,మరో ఆరుగురు ఒరిస్సాకు చెందిన బీఈడీ విద్యార్థులుగా గుర్తించారు. గాయపడ్డ వారిలో ఇద్దరు ఆటో డ్రైవర్లు వున్నారు. ఒరిస్సా కు చెందిన బిఈడి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రాత్రి కంభం నుండి బేస్తవారిపేటకు ఆటోలలో వస్తున్న క్రమంలో ఘటన చోటు చేసుకుంది. గాయపడ్డ వారిని కంభం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు.

## కాల్పుల్లో తెలుగు యువతి మృతి

**ఎల్బీనగర్**



అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం సృష్టించింది. టెక్సాస్ రాష్ట్రం అలెన్ పట్టణంలో ఓ మాల్లో జరిగిన కాల్పుల్లో 8 మంది చనిపోయారు. ఈ ఘటనలో 27 ఏళ్ల తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయింది. హైదరాబాద్లోని సరూర్నగర్కు చెందిన తాటికొండ ఐశ్వర్య రెడ్డి దుండగుల తూటాలకు బలైంది. ఐశ్వర్య పర్ ఫెక్ట్ జనరల్ కాంట్రాక్టర్స్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె తండ్రి పేరు నర్సిరెడ్డి. రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిగా పనిచేస్తున్నారు. కూతురు మరణవార్త తెలిసి శోకసంద్రంలో మునిగిపోయారు. అమెరికాలో స్థిరపడిన అమ్మాయి ఇలా దుండగుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## జనసంద్రం గా మారిన కర్నూలు

**కర్నూలు**

కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్దకు నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం ఉదయం చేరుకుంది. అయనకు అక్కడ ఘన స్వాగతం లభించింది. లోకేష్ పాదయాత్రతో కర్నూలు వీధులు కిక్కిరిసాయి. లోకేష్ ని చూసేందుకు మహిళలు, యువత, వృద్దులు భారీగా రోడ్లపైకి వచ్చాయి. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యల గురించి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు వింటూ అందరితో లోకేష్ ఫోటోలు దిగారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలు లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేస్తామని అయన హామీ ఇచ్చారు.

## ఏసీబీ వలలో జూనియర్ అసిస్టెంట్

**కాకినాడ**



కాకినాడ జిజిహెచ్ లో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు జూనియర్ అసిస్టెంట్ వై సత్యనారాయణ పై వచ్చిన ఆరోపణలకు స్పందించిన ఏ సీబీ బృందాలు రంగంలోకి దిగాయి. జిజిహెచ్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులో ఏసీబీసీఐ సతీష్ కుమార్ సోదాలు నిర్వహించారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య మాట్ఆడుతూ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కి సంబంధించి ఆరు చోట్ల దాడులు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి 40,000 నగదు, 60 కాసుల బంగారం, నాలుగు కీలక డాక్యుమెంట్లు దొరికాయి. సోదాలు కొనసాగుతున్నాయని అన్నారు.

# ఒకే టికెట్పై రెండు బస్సుల్లో ప్రయాణం

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం మల్టీ సిటీ జర్నీ కి వీలుగా రిజర్వేషన్ సౌకర్యాన్ని తీసుకొస్తోంది. ఒకే టికెట్ తీసుకుని రెండు బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని 137 మార్గాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. అయితే బస్సు మారేందుకు 2 గంటల నుంచి 22 గంటల గడువు ఉంటుంది.ఏపీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. కొందరు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. వారు నేరుగా బస్సు లేకపోతే మధ్యలో వేరొక చోట (నగరం, పట్టణం)లో బస్సు మారాల్సి వస్తోంది. అలాంటి వారికి ఇబ్బంది లేకుండా తమ ప్రయాణానికి సంబంధించి బస్సు మారినా సరే ఒకే టికెట్ తీసుకునే విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. సరికొత్తగా 'మల్టీ సిటీ జర్నీ రిజర్వేషన్' పేరిట ఆర్టీసీ రూపొందించింది.ఓ ప్రయాణికుడు అనంతపురం నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే నేరుగా వెళ్లేందుకు అవకాశం లేదు. నేరుగా బస్సు ఉండదు కాబట్టి అనంతపురం నుంచి విజయవాడ వెళ్లి.. అక్కడ మరో బస్సు మారి శ్రీకాకుళం వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడు అనంతపురంలో, విజయవాడలో రెండు టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆర్టీసీ తీసుకొచ్చిన కొత్త విధానంలో.. అనంతపురం నుంచి విజయవాడకు ఒక బస్సులో వచ్చి.. మళ్లీ విజయవాడ నుంచి శ్రీకాకుళంకు మరో బస్సు సర్వీసులో వెళ్లొచ్చు.అంటే బస్సు మారినా సరే ఒకే టికెట్లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఇలా రెండు బస్సుల్లో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేసుకున్నా.. రిజర్వేషన్ ఛార్జి ఒక్కసారి మాత్రమే తీసుకుంటారు. ప్రయాణికులు ఒక బస్సులో బయల్దేరి.. మరొక చోట బస్సులోకి మారేందుకు 2 నుంచి 22 గంటల గడువు ఇచ్చింది ఆర్టీసీ. ప్రయాణికులు ఆ సమయాల్లో ఉన్న సర్వీసులను బట్టి ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది .ఏపీఎస్ ఆర్టీసీ మొత్తంగా 137 మార్గాల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. యూటీఎస్ మొబైల్ యాప్, ఆర్టీసీ ఆన్లైన్ పోర్టల్ ద్వారా ఈ రిజర్వేషన్లు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దేశంలో తొలిసారి ఆర్టీసీల్లో.. ఏపీలో మాత్రమే ఈ విధానం తొలిసారి అమలు చేస్తున్నారు. త్వరలోనే ఈ విధానం ప్రారంభించనున్నారు. ఈ విధానం ముఖ్యంగా విమాన ప్రయాణికులకు బాగా ఉపయోగ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ తొలి విడతలో ఎంపిక చేసిన రూట్లలో మాత్రమే ఈ కొత్త విధానం అమలు చేస్తోంది. ఆ తర్వాత ప్రయాణికుల స్పందనను బట్టి మిగిలిన రూట్లకు కూడా ఈ విధానాన్ని విస్తరించనున్నారు. ఆర్టీసీ ఇప్పటికే పలు కొత్త పథకాలు, ఆఫర్లతో ప్రయాణికులకు దగ్గరవుతోంది. ఇప్పుడు ఈ సరికొత్త విధానంతో మరింత దగ్గరవుతామని భావిస్తోంది. ఆర్టీసీ ఇప్పటికే నగదు రహిత లావాదేవీలను కూడా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో సరికొత్త విధానంతో ప్రయాణికులకు చేరువ అవుతోంది.

# ఎవ్వరికి పట్టని కార్మిక శాఖ

**హైదరాబాద్ :**

తెలంగాణ కార్మిక శాఖ నిస్తేజంగా మారిపోయింది. ఆ శాఖకు పూర్తి స్థాయి కమిషనర్ లేరు. ఇన్ చార్జి కమిషనర్ గా ఉన్న నదీమ్ అహ్మద్ కనిపించరు. ఆ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి వినిపించుకోరు. దీంతో ఆ శాఖలో సమస్యలు తిష్ట వేశాయి. తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికై..తరువాత తెరాస గూటికి చేరిన చామకూర మల్లారెడ్డి 2018 ఎన్నికలలో తెరాస నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనతి కాలంలోనే మంత్రిగా ప్రమోషన్ పొందారు. విద్యా సంస్థల అధినేతగా ఆయన చాలా చాలా బిజీగా ఉంటారు. మంత్రి పదవి అన్నది హోదాగానే తప్ప.. ఆ శాఖపై పట్టు సాధించే దిశగా ఇప్పటి వరకూ ఆయన ప్రయత్నించింది లేదని ఆ శాఖ వర్గాలే చెబుతున్నాయి. ఈ మూడేళ్లలో కార్మిక శాఖపై మంత్రి చామకూర మల్లారెడ్డి ఒక్క సారి కూడా పూర్తి స్థాయి సమీక్ష చేయలేదంటే పరిస్థితి ఏమిటన్నది ఎవరికైనా అవగతమౌతుంది. మంత్రి ఇలా తన శాఖ పట్ల అంటీముట్టనట్టుగా ప్రవర్తిస్తుంటే.. అది చాలదన్నట్లు కార్మిక శాఖకు పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో.. ఇన్ చార్జ్ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న నదీమ్ అహ్మద్ ఆదనపు బాధ్యతపై పెద్దగా దృష్టి పెట్టడం లేదని కార్మిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆయన వారానికి ఒకటి రెండు సార్లు కార్యాలయానికి రావడమే గగనమంటున్నారు. దీంతో కార్మిక శాఖలో ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోక అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ముఖ్యంగా 75వ షెడ్యూల్ లోని రెండు కోట్ల మంది ఉద్యోగుల వేతన పెంపు సమస్య ఏళ్ల తరబడి పెండింగ్ లోనే ఉంది. ఈ సమస్య పరిష్కారం కోసం మంత్రి, కమిషనర్ లను ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం లేకపోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పొందిన వేతనాలే నేటికీ తమకు అందుతున్నాయనీ, ఈ ఎనిమిదేళ్లుగా పైసా జీతం పెరగలేదని వారు వాపోతున్నారు. ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు మేలు చేసే ఉద్దేశంతోనే తమ సమస్య విషయంలో మంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ, మంత్రి ఆసక్తి చూపకపోవడంతో ఇన్ చార్జి కమిషనర్ కూడా పట్టించుకోవడం లేదనీ వారు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి పెండింగ్ లో ఉన్నా తమ వేతనాల ఫైలును ఇప్పటి వరకూ ప్రభుత్వం వద్దకు పంపించలేదని అంటున్నారు. కనీస వేతన మండలి సిఫార్సులకు కూడా అతీగతీ లేకుండా పోయిందని కార్మికులు చెబుతున్నారు. కార్మిక శాఖకు పూర్తి స్థాయి కమిషనర్ ను నియమిస్తే సమస్యలు ఏదో ఒక మేరకు పరిష్కారమౌతాయని వారంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక మంత్రి మల్లారెడ్డి స్వయంగా విద్యా, వైద్య సంస్థలను నిర్వహిస్తున్నా.. కార్మికుల సంక్షేమం ప్రయోజనాల విషయంలో పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని కార్మికులు విమర్శిస్తున్నారు. సీఎం జోక్యం చేసుకుని కార్మిక శాఖ గాడిలో పడేలా చర్యలకు ఉపక్రమించాలనీ, మంత్రి మల్లారెడ్డి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా పని చేసేలా మార్గనిర్దేశనం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

# లిక్కడ్ స్కామ్ బోగస్-అరవింద్ కేజ్రీవాల్

**ఢిల్లీ**

సౌత్ లాబీ రూ.100 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. రాజేష్ జోషి సౌత్ లాబీ నుంచి ఢిల్లీకి డబ్బులు చేరవేసాడని చెప్పారు. రాజేష్ ఒక్క పైసా చెరవేసినట్లు ఆధారాలు లేవని కోర్ట్ చెప్పింది. ఇక కేసులో ఏముందని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ వంద కోట్లను గోవా ఎన్నికల్లో ఖర్చు పెట్టారని ఆరోపించారు. గడచిన 6 నెలల పాటు గోవాలో ఆమాద్మీ పార్టీకి పనిచేసిన వెండర్స్ వద్ద తనిఖీలు, విచారణ చేశారు. చివరికి గోవా ఎన్నికల్లో ఆప్ రూ.19-20లక్షలు నగదు ఖర్చు చేసారని చెప్పారు. మా నిజాయితీకి ఇది సర్టిఫికెట్. ప్రధాని మోదీ ఈ కుంభకోణం కథ అల్లుతున్నారు. దానికి ఆధారాలు సృష్టించాలని అధికారులకు చెబుతున్నారు. 14 ఫోన్లను మనీష్ సిసోడియా ధ్వంసం చేశాడని కోర్ట్ లో చెప్పారు. తనిఖీలు చేసినప్పుడు 14 ఫోన్లు ఉన్నాయి. అందులో 5 ఫోన్లు ప్రస్తుతం వారి వద్దే ఉన్నాయి. ఈడీ న్యాయస్థానంలో అబద్ధాలు చెబుతోంది. ఛార్జ్ షీట్ లో తప్పుగా సంజయ్ సింగ్ పేరు వచ్చిందని చెబుతున్నారు. అనురాగ్ ఠాకూర్, సంబిత్ పాత్ర పేర్లు తప్పుగా ఎందుకు రాలేదు. ప్రధానమంత్రి కార్యాలయం చెప్పిందా సంజయ్ సింగ్ పేరు చేర్చమని? ఐదుగురు సాక్షులను తప్పుడు స్టేట్ మెంట్స్ ఇవ్వాలని కొట్టారు, భయభ్రాంతులకు గురి చేసారని న్యాయ స్థానంకు లేఖ రాశారు. కొట్టడం వల్ల ఒక వ్యక్తికి చెరువులు వినపడడం కూడా లేదు. ఇది దర్యాప్తు అంటారా? లిక్కర్ కుంభకోణం మొత్తం బోగస్. మొదట్నించీ ఈమాట మేము చెబుతూనే ఉన్నాం. ఇప్పుడు కోర్టులు కూడా అదే మాట చెబుతున్నాయి. ఆప్ వంటి నిజాయితీ కలిగిన పార్టీపై నిరంతరం బురదచల్లే ప్రయత్నం బీజేపీ చేస్తోందని అన్నారు.

## గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి మెడల్ అందుకున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

**అమరావతి**



వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా రాజ్ భవన్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ అబ్దుల్ నజీర్ 2022-23 సంవత్సరానికి సంబంధించి 26 జిల్లాల్లో రెడ్ క్రాస్ ద్వారా అత్యుత్తమ సేవలందించిన 11 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు.ఇందులో కొంతమంది ఐ ఏ యస్ లు కూడా ఉన్నారు.అందులో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి అనేక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవడం తోపాటు వ్యక్తిగతంగా 25 లక్షల రూపాయలు డోనేషన్ ను నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ కు అందించినందున ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి ఈ మెడల్ ను అందించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ రెడ్ క్రాస్ చేస్తున్న సేవలను కొనియాడారు.అలాగే రెడ్ క్రాస్ స్టేట్ ఛైర్మెన్ శ్రీధర్ రెడ్డి, మరియు స్టేట్ జనరల్ సెక్రటరీ ఏ కే ఫరీడా గారు రాష్ట్రం లో నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ చేస్తున్న సేవలను గురించి గవర్నర్ గారికి వివరించారు. భారతదేశంలోనే నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ అత్యధిక సేవలు నిర్వహించడం అభినందనీయమని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలియజేశారు. .భవిష్యత్ లో రెడ్ క్రాస్ మరింత ఉన్నత స్థితిలో సేవలందించాలని గవర్నర్ ఆకాక్షించారు.

## చెరువుతో విషం.. చేపలు మృతి

**కాకినాడ**

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆర్ బి పట్నం రాఘవమ్మా చెరువు నీటిలో గుర్తుతెలియని వ్యక్తులు విషం కలిపారు. దాంతో భారీ చేపలు చనిపోయి నీటిపై తేలుతూ ఒడ్డుకు చేరాయి. లీజుదారులు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని వాపోతున్నారు.

## వైభవంగా నల్లగొండ్ల బ్రహ్మోత్సవాలు

**నెల్లూరు**

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో కలిసిన శ్రీ గృహ మల్లేశ్వర శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. దేవస్థాన ధర్మకర్త మండలి మరియు దేవస్థాన ఈవో కళ్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధి సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి అమ్మవారి కృపలకు పాత్రులయ్యారు.

## బాసర లో కేంద్ర మంత్రి

**నిర్మల్**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల సోమవారం దర్శించుకున్నారు. అయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో కేంద్ర మంత్రిని ఘనంగా సన్మానించారు.

## నలుగురు మావోయిస్టులు అరెస్టు

**దంతేవాడ**

ఛత్తీస్గఢ్ దంతెవాడ జిల్లా అరుణ్ పూర్ ఘటనలో కీలక పాత్ర పోషించిన నలుగురు మావోయిస్టు లు అరెస్టు అయ్యారు. ఏప్రిల్ 26న 50 కిలోల ఐఇడితో జవాన్లు ప్రయాణిస్తున్న బస్సు ను పేల్చి, పదిమంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలిసిందే. ఈ ఘటన లో పాల్గొన్న యాక్షన్ టీం లో నలుగురు మావోయిస్టు సభ్యులను చత్తీస్గడ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు పార్టీ కి సంబంధించి, విలువైన సమాచారం పోలీసులు రాబట్టినట్లు సమాచారం. మిగతా వారికోసం కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## నాగబాబుకు ఘన స్వాగతం

**అనకాపల్లి**

అచ్చుతాపురం సెంటర్లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు కు జనసేన కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎలమంచిలి నియోజకవర్గ వెంకటాపురం దగ్గర జనసేన జిల్లా ప్రధాన కార్యాలయాన్ని అయన ప్రారంభించారు. తరువాత భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. అచ్చుతాపురం నుంచి ఎలమంచిలి వెళ్లే రూట్ మొత్తం ట్రాఫిక్ జామ్ అయింది.

## ఫైనాన్సర్ దారుణ హత్య

**మేడ్చల్**

నగరశివారులోని దొమ్మర పోచంపల్లి చెరువు దగ్గర ఓ వ్యక్తి రక్తసిక్తంగా అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన దృశ్యాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు.. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో మృతుడు దుండిగల్ కు చెందిన వెంకటేష్ గౌడ్(40) సంవత్సరాల వ్యక్తి గా గుర్తించారు..ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుండి బయటికి వెళ్లినట్లు, రాత్రే శరీరం పై 3 కత్తి పోట్లు తో దారుణ హత్య కు గురైనట్లు పోలీసులు గుర్తించారు.. స్థానికంగా సెంట్రింగ్, మెటీరియల్ కిరాయికి ఇస్తూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తాడని సమాచారం..కేసు నమోదుచేసుకొన్న పోలీసులు డాగ్ స్క్వాడ్ తో స్థలాన్ని పరిశీలించారు.

## అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**విశాఖపట్నం**

కొత్తపాలెం ఆదర్శనగర్ రైల్వే ట్రాక్ పై తెలగవలస సూర్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. ట్రాక్ ప్రక్కన మొండెం బాడీ వేరుగా పడి ఉండటంతో ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి కి చెందిన మృతుడు సూర్యనారాయణకు భార్య,ముగ్గురు పిల్లలు. కూలి పనుల నిమిత్తం ఆదర్శనగర్ లో కుటుంం వుంటోంది.

## కాంట్రాక్టు కార్మికుడి మృతి ఆందోళన

**విశాఖపట్నం**

విశాఖ హెచ్ పి సి ఎల్ కర్మాగారం ఎల్పిజి ప్లాంట్ లో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం రేపిం ది. ఈమేరకు శ్రీహరిపురం పవన్ పుత్ర నగర్ ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ కార్మికుడు శ్రీధర్ అనే వ్యక్తి ప్లాంట్ లో మృతి చెందాడు. ఘటనకు సంబందిం చి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్లాంట్ లో ప్రమాదవశాత్తు మృతి చెందాడ లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు పోస్టుమా ర్టం నివేదిక ఆధారంగా తెలుస్తుంది. ప్రస్తుతానికి మృతదేహాన్ని పోలీసులు కేజీహెచ్ మార్చురికి తరలించారు.ఈ క్రమంలో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.కుటుంబ సభ్య లకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు.దీంతో అక్కడ ఉద్రిక్తత ఏర్ప డింది.

ప్రజా తపన
prajathapana.com

# సెటిలర్లే లక్ష్యంగా కేటీఆర్ అడుగులు


**హైదరాబాద్ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయి ఎనిమిదేళ్లు గడిచిపోయింది. ఎనిమిదేళ్లుగా తెలంగాణలో ఒక్కటే పార్టీ ప్రభుత్వాన్ని నడిపిస్తుంటే.. ఏపీలో మాత్రం తొలి ఐదేళ్లు చంద్రబాబు పాలిస్తే.. ఇప్పుడు మూడేళ్లుగా జగన్ ప్రభుత్వం నడుస్తుంది. విడిపోయిన రెండు రాష్ట్రాల ఆలనా పాలనలో పక్క రాష్ట్రాల నేతల ప్రభావం అంతగా లేనప్పటికీ ఉమ్మడి రాష్ట్రం నాటి భావోద్వేగాలు, సెంటిమెంట్లు ఇప్పటికీ అలాగే విలసిల్లడానికి రాజకీయం తన వంతు దోహదం చేస్తూనే ఉంది. మామూలు సమయాలలో వీటి తీవ్రత ఉనికి పెద్దగా కనిపించకపోయినా.. ఎన్నికలొస్తున్నాయంటే మాత్రం సెంటిమెంట్ మంత్రమే రాజకీయ పార్టీలకు, నాయకులకు గెలుపు మంత్రంగా ఉపయోగపడుతుంటుంది. ముఖ్యంగా ఈ సెంటిమెంట్ ను అనుకూలంగా వినియోగించుకోవడంలో తెలంగాణ మరీ ముఖ్యంగా బీఆర్ ఎస్ ఒక ఆకు ఎక్కువే చదివింది. తెలంగాణలో ఆంధ్ర నుంచి వచ్చి స్థిరపడిన వారు ఎక్కువే ఉన్నారు.. ఉమ్మడి రాష్ట్రంలో ఇక్కడే స్థిరపడిన ఆంధ్రా ప్రజలు ఇప్పటి తెలంగాణలో కూడా చెప్పుదగ్గ స్థాయిలో ఇక్కడి రాజకీయాలను మలుపు తిప్పగలరు. దాదాపు పాతిక నియోజకవర్గాలలో గెలుపు ఓటములను ప్రభావితం చేయగలరని కూడా ఇక్కడి రాజకీయాలలో ఓ లెక్క ఉంది. అందుకే తెలంగాణలో అధికారం దక్కాలంటే ఇక్కడ స్థిర పడిన వారి మద్దతు కోసం రాజకీయ పార్టీలు ఓ కన్నేసి ఉంచుతాయి. ఇలా స్థిరపడిన ఆంధ్రుల ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మలచుకోవాలంటే ఏపీలో పరిస్థితులను తెలంగాణ నాయకులు అర్థం చేసుకోవాలి.. ఆ భావోద్వేగాలకు తగ్గట్లే నడుచుకోవాలి. టీఆర్ఎస్ పార్టీకి ఈ మనోభావాలను అర్థం చేసుకోవడం.. భావోద్వేగాలను అనుకూలంగా మార్చుకోవడం వెన్నతో పెట్టిన విద్య.. గత ఎన్నికల సమయంలో కూడా ఏపీలో పరిస్థితులకు తగ్గట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి ఆంధ్రుల మద్దతు పొందడం కోసమే.. నాడు ఏపీలో వ్యతిరేకతను ఎదుర్కొంటున్నచంద్రబాబుపై విమర్శలు చేశారు.అవినీతి, రెండు కళ్ల సిద్ధాంతంలో ఏపీ ప్రయోజనాలను దెబ్బతీశారంటూ, సెంటిమెంటును రెచ్చగొట్టడం ద్వారా ఇక్కడి ఆంధ్రుల మద్దతు పొందే ప్రయత్నం చేశారు. ఇప్పుడు మరో సారి ఎన్నికల సమయం దగ్గర పడుతున్న సమయంలో కేటీఆర్ ఇక్కడ స్థిర పడిన ఆంధ్రుల్లో జగన్ పాలన పట్ల ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికే.. ఏపీలో రోడ్లు, విద్యుత్ పరిస్థితి అధ్వానంగా ఉంటే తెలంగాణలో అద్భుతంగా ఉన్నాయని అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. ఏపీలో పరిస్థితులపై ఆయన చేసిన వ్యాఖ్యలపై అక్కడా, ఇక్కడా కూడా హర్షామోదాలే వ్యక్తం అవ్వడమే ఇందుకు నిదర్శనం. ఏపీలో వైసీపీ తప్ప మరే పార్టీ వారు కానీ, జన సామాన్యం కానీ ఖండించలేదు సరికదా సమర్థించారు. ఇక్కడ స్థిరపడిన ఆంధ్రులకు కూడా జగన్ నిర్వాకం వల్లే అక్కడి పరిస్థితులు అలా ఉన్నాయని కేటీఆర్ ను సమర్థించారే తప్ప ఏపీపై వ్యాఖ్యలేమిటని విమర్శలు చేయలేదు .ఎన్నికల్లో ఎలాగైతే ఏపీలో చంద్రబాబుపై వ్యతిరేకతను తెరాస ఇక్కడ ఓట్లుగా మార్చుకుందో.. అదే విధంగా ఈ సారి జగన్ పై అక్కడి వ్యతిరేకతను క్యాష్ చేసుకునే వ్యూహం తోనే కేటీఆర్ తెలంగాణతో ఏపీలో పరిస్థితులను పోలుస్తూ అభివృద్ధి చిరునామాగా తెలం గాణను తీర్చిదిద్దామని చెప్పుకున్నారు. కేటీఆర్ వ్యాఖ్యలకు అక్కడా, ఇక్కడా అంటే ఏపీలోనూ, తెలంగాణలోనూ కూడా మద్దతు లభించిందంటే ఆయన వ్యూహం ఫలించినట్లేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# గజ్వేలు నుంచి గద్దర్ పోటీ

**మెదక్ :**

త్వరలో జరగనున్న తెలంగాణ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయి. ఇప్పటికే అధికార పార్టీ.. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలన్న ఉత్సాహంతో జనాల్లోకి వెళ్తుండగా.. అటు ప్రతిపక్ష పార్టీలు సైతం బీఆర్ఎస్‌ను గద్దె దించటమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ఈ క్రమంలోనే ఇన్నాళ్లు ప్రజల పక్షాన ప్రత్యక్ష విప్లవ పోరాటంలో పాల్గొన్న ప్రజా యుద్ధనౌక గద్దర్.. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల్లోకి అడుగుపెడుతున్నారు. గత ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసిన గద్దర్.. ఇప్పుడు ఏకంగా ఎన్నికల బరిలో అభ్యర్థిగా నిలబడేందుకు సిద్ధమవుతున్నారు. 76 ఏళ్లున్న గద్దర్.. ఇక నుంచి తాను పుట్టిన ఊరైన మెదక్ జిల్లా తూప్రాన్‌లోనే ఉండాలనుకుంటున్నట్లుగా తెలిపారు. త్వరలో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా పోటీ చేయనున్నట్టు సొంతంగా ఆయనే ప్రకటించారు.తాను ఇక నుంచి తూప్రాన్‌లోనే నివాసముంటానని.. తనకు



రక్షణ కల్పించాలంటూ తూప్రాన్ పోలీసులకు వినతి పత్రం కూడా సమర్పించారు. ఇప్పుడిది సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే.. ఆయన ఎన్నికల్లో పోటీ చేయటమే.. ఓ ఆసక్తికర అంశమైతే.. ఎక్కడి నుంచి పోటీ చేస్తారు.. ఎవరితో ఢీకొట్టనున్నారనేది.. మరింత ఆసక్తికంగా మారింది. అయితే.. ఆయన పోటీ చేసేది.. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం నుంచే పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ఇది తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది గద్దర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నారనేది.. కొద్ది రోజులుగా వినిపిస్తోన్న.. ఆయన ఏ పార్టీలో చేరనున్నారు.. ఏ నియోజకవర్గం నుంచి బరిలో దిగుతారు.. అనేది మాత్రం క్లారిటీ లేకపోయింది. గతంలోనూ తాను కేసీఆర్‌పై పోటీ చేస్తానని పేర్కొన్నా.. అది జరగలేదు. ఇప్పుడు ఆయనే స్వయంగా ప్రకటించటంతో.. ఆ ప్రశ్నలకు ఆన్సర్స్ దొరికినట్టైంది. ఎన్నికల్లో పోటీ చేస్తానని.. అది కూడా సీఎం కేసీఆర్‌పైనే గజ్వేల్ నుంచి పోటీ చేస్తానని ప్రకటించటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు.. ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి పెట్టినట్టు సమాచారంఇదిలా ఉంటే వచ్చే ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీ చేసేందుకు బీజేపీ నుంచి ఈటల రాజేందర్ రెడి అని ప్రకటించారు. మరోవైపు.. హస్తం పార్టీ కూడా బలమైన అభ్యర్థిని కేసీఆర్‌కు పోటీగా దింపేందుకు సిద్ధమవుతోంది. ఇక ఇప్పుడు.. ఇన్ని రోజులు తన పాటతో తెలంగాణ సమాజాన్ని ఎంతో ఉత్తేజపరిచి.. ప్రజా యుద్ధనౌకగా పేరు తెచ్చుకున్న గద్దర్.. ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయల్లో దిగుతున్న సందర్భంలో.. ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు చవిచూడనున్నరన్నది వేచి చూడాల్సిందే.

# ఏపీలో హాట్ టాపిక్‌గా మారిన మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

**అమరావతి :**

;తెలంగాణలో అమరరాజా కంపెనీ ఏకంగా రూ. 9,500 కోట్ల పెట్టుబడి పెట్టడం... దాదాపు 10 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధిని కల్పించే 'అమరరాజా గిగా కారిడార్'కు శంకుస్థాపన జరగడం దానికి మంత్రుల స్థాయి వ్యక్తులు హాజరయ్యి మాట్లాడడం.. ఇవేమీ సంచలనాత్మక విషయాలు కాకపోవచ్చు, చర్చనీయాంశమూ కాకపోవచ్చు. కానీ అమరరాజా కంపెనీ ఆంధ్రప్రదేశ్ నుంచి తరలివచ్చి తెలంగాణలో శంకుస్థాపన చేసుకోవడమే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఏపీలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఏపీలో ఆసక్తికర చర్చకు దారితీశాయి. ఇంతకీ ఏపీ ప్రజల్లో జరుగుతున్న ఆ చర్చ ఏమిటి?. కేటీఆర్ ప్రసంగానికి, ఏపీ సీఎం జగన్‌కు సంబంధం ఏమిటి?..మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం 'అమరరాజా గిగా కారిడార్' శంకుస్థాపన కార్యక్రమం సందడిగా జరిగింది. గల్లా జయదేవ్, రామచంద్ర నాయుడు, అరుణతోపాటు తెలంగాణ మంత్రులు కేటీఆర్ , శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌కు సమీపంలో దివిటిపల్లి వద్ద సుమారు 270 ఎకరాల్లో ఈ లిథియం అయాన్ బ్యాటరీ కంపెనీ ఏర్పాటు చేస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కంపెనీ ద్వారా రూ.9,500 కోట్ల భారీ మొత్తంలో పెట్టుబడి రానుంది. ఒకప్పుడు వలసలకు కేంద్రంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఈ కంపెనీతో దశ మారనుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదే అభిప్రాయాన్ని మంత్రి కేటీఆర్ కూడా వ్యక్తం చేశారు. " ఒక పరిశ్రమ రావాలంటే దాని వెనుకాల తదేకమైన దీక్షతో, పట్టుదలతో పని చేస్తేనే వస్తాయి. ఇది పోటీ ప్రపంచం. పోటీ ప్రపంచంలో అవినీతి రహిత పారదర్శకమైన పాలనతో ముందుకు వెళ్తున్నాం. ఈ దేశంలో ఎక్కడైనా అమరరాజా గ్రూప్ ప్లాంట్ పెట్టుకోవచ్చు. దివిటిపల్లిలో ప్లాంట్ పెడుతామని ప్రకటించిన తర్వాత 8 రాష్ట్రాల సీఎంలు, మంత్రులు వారికి ఫోన్ చేసి తమ తమ రాష్ట్రాలకు రావాలని ఆహ్వానించారు. కానీ అమరరాజా గ్రూప్ వారు ఇక్కడే ప్లాంట్ ప్రారంభించేందుకు సముఖత వ్యక్తం చేశారు. దీక్షతో, పట్టుదలతో పని చేస్తేనే పెట్టుబడులు వస్తాయి" అని వ్యాఖ్యానించారు. కాబట్టి అందరికీ ఉద్యోగాలు కల్పించాలంటే.. ప్రయివేటు రంగంలో పెట్టుబడులను ఆహ్వానించాలి. పరిశ్రమలకు ఊతమిస్తేనే కొలువులు వస్తాయి. రాష్ట్రానికి సంపద వస్తుంది. ఈ సంపదతో పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు ఉపయోగపడుతంది" అని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ మాట్లాడిన ఈ మాటలే ఏపీలో ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. దీనికి కారణంగా ఏపీ నుంచి తరలివెళ్లిన అమరరాజా కంపెనీ తెలంగాణలో తమ కంపెనీని ఏర్పాటు చేయడమే కారణంగా ఉంది. భారీ పెట్టుబడి పెట్టే కంపెనీని తెలంగాణకు అప్పగించారని సీఎం జగన్ సర్కారుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

# ఆర్వోబీని ప్రారంభించిన మంత్రులు

**మహబూబ్ నగర్**

దేవరకద్రలో 24 కోట్ల 67 లక్షలతో నూతనంగా నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని, నుతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంను రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ప్రారంభించారు.

తరువాత దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో పాల్గొన్నారు.

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కరువు తప్ప అభివృద్ధి తెలియని జిల్లా పాలమూరు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ లు వలసల జిల్లా గా పాలమూరు ను మార్చారు. డెబ్బై ఏండ్ల పాలనలో కరువు,వలసలు మాత్రమే పాలమూరు జిల్లా చూసింది. ఇప్పుడిప్పుడే పాలమూరు పచ్చబడుతుంది. పెండింగ్ ప్రాజెక్ట్ లను సీఎం కేసీఆర్ పూర్తి చేశారు. పాలమూరు లో వేరే రాష్ట్రం నుండి కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నది నిజం కాదా? సీఎం కేసీఆర్ కొత్త సెక్రటేరియట్ లో మొట్టమొదటి సమీక్ష పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు మీద చేశారు. రేవంత్ వ్యవహారం ప్రజలందరికీ తెలిసిపోయింది.



రేవంత్ తనకుతాను గొప్ప నాయకుడు అని ఊహించుకుంటున్నాడు. పిచ్చి మాటలు మానుకోవాలని రేవంత్ ను హెచ్చరిస్తున్నాను. చట్టం అడ్డంపెట్టుకుని బ్లాక్ మెయిల్ చేస్తూ రాజకీయాలు చేస్తాడు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఎంపీ పదవి తీసేస్తే చప్పుడు లేదు. నరేంద్రమోదీ అసమర్థ ప్రధాని. ధరల పెరుగుదల, రూపాయి విలువ పడిపోవడం నరేంద్రమోదీ పనితనం. పెట్రోల్ ,డీజిల్ ధర డబుల్ చేసిన ఏకైక ప్రధాని మోడీ. మన ఎల్ ఐ సి డబ్బులు అదాని కంపెనీలో పెట్టుబడి పెడుతున్నారు. ప్రజల డబ్బును ప్రైవేట్ కంపెనీ లో పెట్టడానికి మోడీ ఎవరు? ప్రైవేట్ కంపెనీలకు లబ్ది చేకూరుస్తూ వారు ఇచ్చిన డబ్బులతో ఎమ్మెల్యే లను కొంటున్నాడు.. కేసీఆర్ మన సంక్షేమం కోసం డబ్బులు పంపిస్తుంటే మోడీ మన డబ్బులు తిరిగి తీసుకుంటున్నాడని అన్నారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రం పట్టించుకోకపోయిన దేవరకద్ర ఆర్వోబి పూర్తి చేసుకున్నాం. డెబ్బై యేండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ లు పాలమూరు ను వలసల జిల్లా గా మార్చారు. వంద ఎకరాలు ఉన్న రైతు ఊరు వదిలి కూలీ పనికి పోయిండు.. చెక్ డ్యామ్ లు కట్టాలనే ఆలోచన చేయలేదు. మళ్ళీ తెలంగాణ ను ఆగం చేయాలని చూస్తున్నారు. కులం మతం పేరుతో మనుషుల మధ్య విద్వేషాలు పెంచుతున్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం. ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యే లు గా,మంత్రులుగా పని చేసిన వాళ్ళు మళ్ళీ కొత్త వేషం తో ప్రజల ముందుకు వస్తున్నారు. కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకోస్తామని అన్నారు.

# టీడీపీ, జనసేన పార్టీ పొత్తులపై చర్చలు వద్దు

**పవన్ కల్యాణ్ కు సలహాలు**

**ఇవ్వొద్దు- నాగబాబు**

**అనకాపల్లి**

రాష్ట్రంలో జనసేన పార్టీ అధికారంలోకి రావాలని, ముఖ్యమంత్రి జగన్ పోవాలని.. అప్పుడు రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం హరిపురంలో ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాగబాబు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ పొత్తులపై చర్చలు వద్దని చెప్పారు. జనసే పార్టీ తరఫున ఎవరు పోటీ చేస్తే వారిని గెలిపించడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. అలాగే ప్రజల్లో చైతన్యం మొదలైందన్నారు. గత ఎన్నికల్లో 7 శాతం ఓట్లు రాగా.. ఇప్పుడు ఓటింగ్ శాతం 35కు పెరిగిందని అంచనాలు చెబుతున్నాయి. పార్టీకి మహిళలు ఆక్సిజన్ లాంటి వాళ్లని, పవన్ కల్యాణ్ కు సలహాలు ఇవ్వొద్దని అన్నారు. అలాగే ఆయన నిర్ణయాన్ని అంతా గౌరవిద్దామని నాగబాబు చెప్పుకొచ్చారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకొని నాయకులు రూ. లక్షల కోట్లు స్వాహా చేస్తుంటే.. ప్రజలకు మంచి చేయడానికి డబ్బులు ఎందుకు ఉండవని నాగబాబు ప్రశ్నించారు. పవన్ అధికారంలోకి వస్తే అన్ని పంటలకు గిట్టుబాటు ధర



ఇప్పిస్తారని చెప్పారు. పార్టీ రాష్ట్ అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్ తన ప్రసంగంలో ఎలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తి రాజు అక్రమాలను ఎండగట్టారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు విజయ్ కుమార్ తన వ్యక్తిగత నిధులు రూ.5 లక్షలను సాయంగా అందించారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి హరిపురం వరకూ రెండు వేల మందిలో భారీ బైకు, కార్ల ర్యాలీ నిర్వహించారు.

**జనవరిలో అనంతపురంలో**

**పర్యటించిన నాగబాబు**

అనంతపురం నగరంలో జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, టాలీవుడ్ నటుడు నాగబాబు పర్యటించారు. నగరంలోని చెరువు కట్టపై ఉన్న రోడ్డును జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సోదరుడైన నాగబాబు పార్టీ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఇక్కడ రోడ్లు ఎలా ఉన్నాయో, ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కూడా అలాగే ఉందని నాగబాబు ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం పోలీసుల సహకారంతో తమను ఇబ్బంది పెట్టినంత మాత్రాన తమ కార్యక్రమాలను జనసేన ఆపదని స్పష్టం చేశారు. సీఎం జగన్ ఎలాగూ రోడ్లు వేయరని, జనసేనికులు రోడ్లు వేయాలని భావించారు. అయితే జనసేన శ్రేణులు రోడ్లు వేయడం మొదలుపెట్టగానే వైసీపీ ప్రభుత్వం ఆ మంచి పనిని కూడా ఏదో ఓ కారణం చెప్పి అడ్డుకుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో ఇల్లీగల్, చట్ట వ్యతిరేక పనులు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు ఎవరైనా, ఎప్పుడైనా చేయొచ్చు అన్నారు. కానీ ప్రభుత్వం చేయడం లేదని తాము మంచి పనులు మొదలుపెట్టినా ఏపీ ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం నిజం కాదా అని నాగబాబు ప్రశ్నించారు.

# కేరళ స్టోరీ సినిమా చాలా బాగుంది

**అందరూ చూడండి - జేపీ నడ్డా**

**బెంగళూరులో చూసిన నడ్డా**

**బెంగళూరు:**

దేశవ్యాప్తంగా వివాదాస్పదమవుతున్న ది కేరళ స్టోరీ సినిమాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బెంగళూరులోని థియేటర్లో చూశారు. రివ్యూ కూడా ఇచ్చారు. విషపూరితమైన ఉగ్రవాదంలో మరో కోణాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారని ప్రశంసించారు. ఇప్పటి వరకూ ఆయుధాలు, బాంబులతో కూడిన ఉగ్రవాదాన్నే చూశామని...ఈ సినిమా మరో కోణంలో టెర్రరిజాన్ని పరిచయం చేసిందని కితాబునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఏ రాష్ట్రానికో, మతానికో ఆపాదించాల్సిన పని లేదని తేల్చి చెప్పారు. సొసైటీకి ఈ సినిమా ఓ హెచ్చరిక అని స్పష్టం చేశారు. "తుపాకుల మోతలు, బాంబు పేలుళ్లు, ఆత్మాహుతి దాడులు..ఇలా ఎన్నో ఉగ్రచర్యల్ని చూశాం. కానీ అంత కన్నా ప్రమాదకరమైన, విషపూరితమైన ఉగ్రవాదాన్ని ఈ సినిమాలో చూపించారు. బాంబులు, ఆయుధాలు లేని ఉగ్రవాదాన్ని కళ్లకు కట్టారు. ఉగ్రవాదులు సమాజంపై ఎంత విషం చిమ్ముతున్నారో వివరించారు. ఈ ఉగ్రవాదాన్ని ఏ ఒక్క రాష్ట్రానికో, మతానికో పరిమితం చేయలేం. యువత వాళ్ల వలలో పడి ఎలా దారి తప్పుతోందో ఈ సినిమాలో చాలా స్పష్టంగా చూపించారు. అలా దారి తప్పకూడదని హెచ్చరించడమే ఈ సినిమా ఉద్దేశం. ఇది సినిమానే కావచ్చు. కానీ ఉగ్రవాదానికి సంబంధించి ఎన్నో విషయాలు ఇందులో ప్రస్తావించారు. ఉగ్ర మూకల్లో కలిసిపోతున్న మన యువత ఎలా వలలో చిక్కుతోందో చూపించారు. ఈ సినిమా అందరూ చూడాలని రిక్వెస్ట్ చేస్తున్నాను"

**విమర్శలు..**

అయితే...ఈ సినిమాని బీజేపీ ఓన్ చేసుకుంటోందని, కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శిస్తున్నాయి మిగతా పార్టీలు. ముఖ్యంగా కేరళలో దీనిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. పలు చోట్ల సినిమా ప్రదర్శించకుండా అడ్డుకుంటున్నారు. ముస్లిం సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. కేరళ సీఎం పినరయి విజయన్...ఈ సినిమా తప్పుదోవ పట్టించే విధంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. అంత మంది మతం మారినట్టు లెక్కలు లేవని తేల్చి చెప్పారు. మత సామరస్యంపై విషం చిమ్ముతున్నారని మండి పడ్డారు. తమిళనాడులోనూ ఇదే స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బీజేపీ కావాలనే ఇలాంటి సినిమాలకు సపోర్ట్ చేస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకు తగ్గట్టుగానే మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సినిమాపై ట్యాక్స్ ఎత్తివేస్తున్నట్టు ప్రకటించింది. స్వయంగా ముఖ్యమంత్రి శివ్రాజ్ సింగ్ చౌహాన్ ఓ వీడియో విడుదల చేసి ఈ విషయం వెల్లడించారు. బీజేపీ సహా మరి కొన్ని హిందూ సంస్థలు కేరళ స్టోరీ సినిమాపై పన్ను వసూలు చేయొద్దని డిమాండ్ చేశాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న చౌహాన్. ..వెంటనే ఈ ప్రకటన చేశారు.

ప్రజా తపన
prajathapana.com

# తెలంగాణ వర్సిటీ దిద్దుబాటు చర్యల్లో సర్కార్

**నిజామాబాద్ :**

తెలంగాణ యూనివర్సిటీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పాలనను గాడిలో పెట్టేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) కీలక భేటీ జరిగింది. దీంట్లో కీలకమైన నిర్ణయాలు తీసుకుని తీర్మానాలు చేశారు. ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం టీయూను గాడిలో పెట్టడంలో భాగంగానే ఈసీ మీటింగు, తీర్మానాలు చేయించినట్టు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా వీసీ రవీందర్ గుప్తాపై ఏసీబీకి, విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానం చేశారు. గత కొంత కాలంగా నిత్యం యూనివర్సిటీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. వీసీ చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని తీర్మానం చేయడంతో పాటు ..వీసీ అనధికారికంగా నియమించుకున్న ముగ్గురు రిజిస్ట్రార్లు శివశంకర్, విద్యావర్ధిని, నిర్మలాదేవీ లపై క్రిమినల్ కేసులకు చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. గతంలో నియమించిన రిజిస్ట్రార్ ఏడాది గడువు కాలం పూర్తికాకముందే అతన్ని తొలగించినందున.. మళ్లీ అతన్నే రిజిస్ట్రార్‌గా నియమించాలని ప్రభుత్వాన్ని కోరింది ఈసీ. దీంతో ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈసీ మీటింగులో మారయ్య గౌడ్, నసీం, హారతి, రవీందర్ రెడ్డి, వసుంధర, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అధికారుల మధ్య సమన్వయం లోపించి ఏడాదిన్నర కాలంగా సమావేశాలు లేక వర్సిటీలో ఏం




జరిగిందో తెలియని పరిస్థితి. వారం కింద జరిగిన భేటీలో అనూహ్య నిర్ణయాలతో అందరిని ఆశ్చర్య పరిచింది పాలక మండలి. తాజాగా మరోమారు జరిపిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. వీసీపైనే విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించడం, ఇన్చార్జి రిజిస్ట్రార్ గా ఉన్న ప్రొఫెసర్ విద్యా వర్ధినిని సస్పెండ్ చేశారు. వీసీపై ఏసీబీ విచారించాలని నిర్ణయించడం సంచలన నిర్ణయమే. అకడమిక్ కన్సల్టెంట్ విధుల్లో నుంచి తొలగింపు నిర్ణయంతో పాటు వారం రోజుల్లోనే పదోన్నతుల రద్దు, అడ్వాన్సులు తీసుకున్న వారికి రికవరీ నోటీసుల జారీ వంటి నిర్ణయాలు జరిగిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసినా ఇంకా బడ్జెట్ ఆమోదం పొందలేదు. రెండు సమావేశాల్లో దీనిపై చర్చించినా చేసిన ఖర్చులకు సరైన లెక్కలు లేవని అధికారులు సమాధానం ఇచ్చారు. గడిచిన 8 నెలల కాలంలో వివిధ కార్యక్రమాల పేరిట పెద్ద మొత్తంలో వ్యయాలు చేసినట్లు వివరించారు. ఎక్కువ మొత్తం నోట్ ఫైల్ లేకుండా డబ్బులు డ్రా చేయటం జరిగిందని చెప్పారు. వీటిని ఏ ప్రాతిపదికన చేశారు? ఇప్పుడెలా లెక్క చూపాలి? అన్నది తేలాల్సి ఉందన్నారు. చెల్లింపుల విషయంలో నిబంధనలు పాటించలేదని వివరించారు. దీంతో మళ్లీ బడ్జెట్ పక్కకు పెట్టారు. దీనికి ఆమోదం లభిస్తేనే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 పద్దు ప్రతిపాదనల ఆమోదంపై ముందుకెళ్లాల్సి ఉంటుంది. దీంతో రెండు బడ్జెట్లపై పీటముడి వీడలేదు. సమస్యను అధిగమించేందుకు నిధుల దుర్వినియోగం అంశంపై విచారణ పూర్తిచేయాలని నిర్ణయించింది. నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఖర్చులపై విచారించేందుకు ఐదుగురి సభ్యుల కమిటీ వర్సిటీకి రానుంది. బడ్జెట్ ఆమోదం లేకుండా ఎంత ఆర్థిక వ్యయాలు చేశారు? అందులో నోట్ ఫైల్ లేకుండా ఎన్ని ఉన్నాయి? వాటిని ఎందుకు చేశారో? పరిశీలించనున్నారు. ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి చంద్రకళ నేతృత్వంలో కమిటీ ఆయా అంశాలు పరిశీలించనుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఫైళ్ల ఆధారంగా సిద్ధం చేయాలని ఇప్పటికే రిజిస్ట్రార్ కు సూచించింది. సిబ్బంది ద్వారా కొంత సమాచారం సిద్ధం చేసినట్లు సమాచారం. వీటిల్లో కీలకంగా ఉత్తర్వులు లేకుండా జరిపిన చెల్లింపులు, వర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు చేసిన ఖర్చులున్నాయి. వీటిపై వివరాలు సేకరించి చెక్కులు తయారు చేయటానికి ఉన్న నిబంధనలు పాటించారా? ఆ చెక్కును అనుమతిస్తూ సంతకాలు చేసేప్పుడు సరి చూశారా? అనే విషయాలు కీలకం కానున్నాయి.

# సిపిఎస్ రద్దు చేయండి

## ఏపీ జెఎసి అమరావతి నాయకులు

**అమరావతి**

ఉపాధ్యాయుల పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని సస్పెన్షన్ ఎత్తి వేసి తిరిగి విధులలో చేర్చుకోవాలని ఏపీ జెఎసి అమరావతి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్సి పే స్కేల్ ను తక్షణమే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని అన్నారు. ఈ



కార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర కోశాధికారి వి వి మురళీకృష్ణనాయుడు, రాష్ట్ర సలహాదారుల్నెుడ్ కె శ్రీరాములు, జిల్లా చైర్మన్ ఎస్.వీ రమణ, డిప్యూటీ తహశీల్దార్ రాజు, పి.లక్ష్మణరావు, పి వేణుగోపాలరావు, వసంతరావు, అర్లయ్య, ఎస్ గోవింద రావు, కె సుమన్, బైరి అప్పారావు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆనంద నిలయాన్ని వీడియో చిత్రీకరించిన వ్యక్తిపై చర్యలు

**తిరుమల,**

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆనంద నిలయాన్ని వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టీటీడీ నిఘా మరియు భద్రతాధికారి నరసింహ కిషోర్ తెలిపారు. టీటీడీ నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంలోనికి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడం, వీడియో చిత్రీకరించడం నేరమన్నది భక్తులందరికీ తెలుసు. నిన్న రాత్రి తిరుమలలో ఉరుములతో కూడిన భారీ వర్షం పడిన నేపథ్యంలో, దాదాపు రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలోనే సదరు భక్తుడు పెన్ కెమెరా ద్వారా వీడియో చిత్రీకరించినట్టు అనుమానిస్తున్నామన్నారు. అన్నీ తెలిసి ఒక భక్తుడు ఇలా చేయడం చాలా బాధాకరము. సీసీటీవీల ద్వారా సదరు భక్తుడిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని టీటీడీ నిఘా మరియు భద్రతాధికారి నరసింహ కిషోర్ తెలిపారు. టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఈ ఘటనపై పూర్తి విచారణ చేపడుతున్నామని కూడా సీవీఎస్వో తెలిపారు.

# అక్రెడిటేషన్ నిబంధనలు సరళీకరించాలి

**- ఏ.పి.యు.డబ్ల్యూ.జే.**

**ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతా...**

**కమీషనర్ విజయకుమార్ రెడ్డి**

**విజయవాడ :**

అక్రెడిటేషన్ నిబంధనలను సరళతరం చేయాలన్న డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి. విజయకుమార్ రెడ్డి హామీఇచ్చారు. నిబంధనలను సరళతరం చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ ఇవ్వాలని కోరుతూ సోమవారం వినతిపత్రం అందజేసిన ఏ.పి.యు.డబ్ల్యూ.జే. రాష్ట్ర ప్రతినిధి బృందానికి కమిషనర్ టి విజయకుమార్ రెడ్డి ఆమేరకు హామీ ఇచ్చారు. అక్రెడిటేషన్ కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏ.పి.యు.డబ్ల్యూ.జే. రాష్ట్ర ప్రతినిధి బృందం సోమవారం కమిషనర్ విజయకుమార్ రెడ్డి ని కలిసింది. కమిషనర్ ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు , ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, ఐ.జే.యు. జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ , జాతీయ కార్యవర్గ సభ్యుడు డా. ప్రసాద్ , ఏ.పి.ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏచూరి శివ , ఏ.పి. ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు , ఏ.పి.యు.డబ్ల్యూ.జే. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.జయరాజ్ , డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.అక్కులప్ప , కార్యదర్శులు ఏ.జయప్రకాష్ , మండేల శ్రీరామమూర్తి , పి. రామసుబ్బారెడ్డి , కోశాధికారి ఏ.వి. శ్రీనివాసరావు , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చావా రవి , యూనియన్ సీనియర్ నాయకులు షేక్ బాబు , దారం వెంకటేశ్వరరావు , డి. నాగరాజు , జి.రామారావు తదితరులు ఉన్నారు.



75000 - 3లక్షల మధ్య సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు అన్ని మండల కేంద్రాల్లో అక్రెడిటేషన్ ఇవ్వాలని, కొత్తజిల్లాల ఏర్పాటు నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జిల్లా కేంద్రాల్లో , వార్తా కేంద్రాల్లో ఒక్కొక్క యూనిట్ కు అదనంగా అక్రెడిటేషన్ ఇవ్వాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. చిన్నపత్రికలకు అక్రెడిటేషన్ సంఖ్యను పెంచాలని, ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికపై బస్సు పాస్ లు ఇవ్వాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు వినతిపత్రాన్ని కమిషనర్ కు అందచేసారు. దానికి స్పందించిన కమిషనర్ టి. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ అక్రెడిటేషన్ ఇచ్చేందుకు వీలుగా ఇప్పటికే కొన్ని నిబంధనలను సరళతరం చేశామని అన్నారు. నిబంధనలు ఇంకా సరళతరం చేయాలన్న యూనియన్ డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చర్చలలో పాల్గొన్న వారిలో జాయింట్ డైరెక్టర్లు కస్తూరి , కిరణ్ కుమార్, స్వర్ణలత తదితరులు ఉన్నారు. తమ సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తూ ఉన్నామని , లేనిపక్షంలో ఉద్యమించాల్సి ఉంటుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఐ.వి.సుబ్బారావు , చందు జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. అంతకు ముందు ఏ.పి.యు.డబ్ల్యూ .జే రాష్ట్ర ఆఫీస్ బెరర్ల సమావేశం ఐ.వి. సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. జీవో 38 లోని నిబంధనలను యధాతథంగా అమలు చేస్తే అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లభించే అవకాశం పోతుందని యూనియన్ నాయకుల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది .

# హిందూపురం సీఐ ఇస్మాయిల్‌పై ఏపీ హైకోర్టు ఆగ్రహం

**అనంతపురం :**

హిందూపురం సీఐ ఇస్మాయిల్‌పై ఏపీ హైకోర్టు (ఆగ్రహం వ్యక్తం చేసింది. జ్యుడీషియల్ అధికారిపై దాడి చేయడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. సీఐకు ఎంత ధైర్యం అంటూ న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఐ చర్య కోర్టు పరిపాలన విధులకు ఆటంకం కలిగించేలా ఉందని వ్యాఖ్యానించింది. సీఐపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే అడ్వకేట్ కమిషన్, కోర్టు సిబ్బందిపై చేయి చేసుకున్న ఘటనలో సీఐ ఇస్మాయిల్‌పై ధర్మాసనం సుమోటో పిల్ నమోదు చేసింది. దీనిపై సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం ముందు విచారణ జరిగింది. వివరాల్లోకి వెళితే..హిందూపురంలో గిరిష్ అనే వ్యక్తిని అక్రమ నిర్బంధం చేశారంటూ అక్కడి కోర్టులో పిటిషన్ వేసే సమయంలో కోర్టు.. అడ్వకేట్ కమిషనర్, సిబ్బందిని అక్కడికి పంపింది. పోలీస్ స్టేషన్‌లో గిరిష్ ఉండడం, చిత్రహింసలకు గురిచేయడంతో.. అతనిని కోర్టులో హాజరుపరచాలని అడ్వకేట్ కమిషనర్ చెప్పగా.. సీఐ ఇస్మాయిల్ అడ్వకేట్ కమిషనర్, కోర్టు సిబ్బందిపై చేయి చేసుకున్నారనే ఆరోపణలపై జిల్లా జడ్జి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు ఇచ్చిన నివేదికను జిల్లా కోర్టు.. రాష్ట్ర హైకోర్టుకు పంపగా దానిని రిజిస్ట్రార్.. ప్రధాన న్యాయమూర్తి ముందుంచారు. దీనిపై వెంటనే సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సోమవారం ఈ కేసు విచారణకు వచ్చింది. విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి దీనికి సంబంధించి పలువురు ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేశారు. దీనిపై వెంటనే తగిన వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

# ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో పలువురికి పురస్కారాలు!

**హైదరాబాద్ :**

“నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు ఈ ఏడాది మొత్తం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన వేడుకలో కళావేదిక స్పెషల్ మ్యాగజైన్‌ను విడుదల చేశారు. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు కాపీని ఆవిష్కరించారు. తొలి కాపీని శ్రీమతి అనురాధా దేవి అందుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ లైఫ్ టైం ఎక్సలెంట్ అవార్డును ఆమెకు అందజేశారు. ఆర్.వి.రమణ మూర్తి లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్‌ను పొత్తూరి రంగారావుకి, ఎన్టీఆర్ కళావేదిక ఫిల్మ్ అవార్డులను రోజా రమణి, రాజ్ కందుకూరి గారికి, పృథ్వీ, సంగీత దర్శకుడు కేఎం రాధాకృష్ణన్, శివ కందుకూరి కృష్ణసాయి. గాయకుడు సాకేత్ వేగి, వివి రష్మిక, నిర్మాత విజయ బాబు, త్రినాథ్ పంపన తదితరులకు అందజేశారు. ముఖ్య అతిథులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. “ఎన్టీఆర్‌ను దేవునిలా భావించే కోట్లాదిమంధిలో నేను ఒక్కదాన్ని. ఆయన, మా నాన్న రమణమూర్తి మంచి స్నేహితులు. వాళ్లిద్దరూ కళా ?సవలోనే జీవితమంతా ఉండిపోయారు. అలాంటి మహానుభావుడి 100 సంవత్సరాల జయంతి సందర్భంగా కళావేదిక స్పెషల్ మ్యాగజైన్ ఆవిష్కరించడం ఆనందంగా ఉంది” అని అనురాధా దేవి అన్నారు. తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు కేల్ దామోదర్ ప్రసాద్, కార్యదర్శి ప్రసన్నకుమార్, వైవిఎస్ చౌదరి, అనుపమ రెడ్డి, రామసత్యనారాయణ, , వివి రష్మిక, దర్శకుడు బాబ్జి, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జి శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలకు ముహూర్తం ఖరారు

**హైదరాబాద్**

ఏటా నిర్వహించే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలకు ఈ ఏడాది ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది జూలై 9న బోనాలు నిర్వహించనున్నట్లుగా నిర్ణయించారు. ఈ విషయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివరించారు. ఆ మరుసటి రోజు జులై 10న రంగం (భవిష్య వాణి) నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని తలసాని పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల విశిష్టతను రాష్ట్ర ప్రభుత్వం నలుదిక్కులా చాటిందని అన్నారు. బోనాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బోనాల విశిష్టత చాటేలాభక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిలో బోనానికి ప్రత్యేక స్థానం ఉంది.

దేవతలను పూజించేందుకు బోనం ఎత్తే సాంప్రదాయం యావత్ తెలంగాణ అంతటా ఉంది. బోనాలను మహంకాళి బోనాలు, ఎల్లమ్మ బోనాలు, పోచమ్మ బోనాలు ఇలా రకరకాల దేవతల పేరిట నిర్వహిస్తుంటారు. అదే తరహాలో హైదరాబాద్లో లష్కర్ బోనాలు ఏటా జరుగుతుంటాయి. ఈ బోనాల సమయంలో అంగరంగ వైభవంగా బోనాల జాతర జరుగుతుంది. పండగ నేపథ్యంలో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి మొదలవుతుంది. బోనమెత్తే మహిళలు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలతో బోనాల జాతర కన్నుల పండుగగా సాగుతుంది.

గత ఏడాది ఉజ్జయిని మహంకాళి బోనాలు జూలై 17వ తేదీన జరిగిన సంగతి తెలిసిందే. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబం మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంది. ఈ సందర్భంగా తలసాని కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. రాజకీయాలకు అతీతంగా బోనాల పండగ వైభవంగా జరగనుందని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా రంగం బోనాల సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా రంగం కార్యక్రమం నిలుస్తుంది. బోనాలు జరిగిన మరుసటి రోజు ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో రంగం కార్యక్రమం ఉంటుంది. స్వర్ణలత అనే మహిళకు అమ్మవారు పూనుతారు. ఆమె నోటి నుంచి వచ్చే మాటలు స్వయంగా అమ్మవారే చెప్పినట్టుగా భక్తులు భావిస్తుంటారు. అమ్మవారికి ఎంత భక్తితో బోనం సమర్పిస్తారో అంతే భక్తి భావంతో రంగాన్నిభక్తులు వింటారు. గత బోనాల సందర్భంగా రంగంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజలు మెక్కుబడిగా చేస్తున్నారని అమ్మవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజలు వారి సంతోషానికే తప్ప, తన కోసం చేయడం లేదని చెప్పారు. గర్భాలయంలో శాస్త్రబద్దంగా పూజలు చేయాలని చెప్పారు

# రాజ్యాధికారం-దివ్యాంగుల భాగస్వామ్యం

**మెదిచల్ /కీసర:**

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దివ్యాంగుల విబాగం ఆద్వర్యంలో రాజ్యాధికారం-దివ్యాంగుల భాగస్వామ్యం అనీ అంశం పై దివ్యాంగ సంఘాల తో సమాలోచన సదస్సు శివలెంక ఉదయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. కావూరు శ్రీనివాస్ అద్యక్షతన జరిగిన ఈ సదస్సును శ్రీ రామలింగేశ్వర దివ్యంగుల కాలనీ కుందన పెల్లి కీసరలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కేబీ శ్రీధర్, సూర్య ప్రకాష్ రావు, తోపాటు పలు దివ్యాంగ సంఘాల నాయకులు గుత్తికొండ కిరణ్ శివ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివలెంక నాగవదయలక్ష్మి మాట్లాడుతూ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో దివ్యాంగ విభాగాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీకి అన్ని దివ్యంగా సంఘాలు మద్దతిస్తున్నాయని తిలిపారు. దివ్యాన్గుల సమస్యలు హక్కులు చట్టాలపై జాతీయ స్థాయిలో అన్ని జీవంగా సంఘాలతో కమిటీ వేస్తున్నామని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధన సమితి అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దివ్యాంగ విభాగం లో ఒక తీవ్ర వికలాంగులు కి ఉన్నత పదవి ఇచ్చి గౌరవించడం దివ్యాంగ ఆశలను ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందన్నారు.

## మణిపూర్ నుంచి విద్యార్థుల రాక

**హైదరాబాద్**

మణిపూర్ నుండి ప్రత్యేక విమానంలో వచ్చిన తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ లకు చెందిన దాదాపు 72 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సి.హెచ్. మల్లా రెడ్డి, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, అడిషనల్ డీజీ లు మహేష్ భగవత్, అభిలాష బిస్త్, డీఐజీ బి. సుమతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ తదితర అధికారులు స్వాగతం పలికారు. తమను మణిపూర్ నుండి సురక్షితంగా రప్పించిన తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు వారు కృతజ్ఞతలను తెలిపారు

## ఇసుక రీచ్ దగ్గర ఉద్రిక్తత

**తిరుపతి**

తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం గుణపాడు- మెట్టు గ్రామాల సమీపంలోని ఇసుక రీచ్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.. ఇసుక రీచ్ లో నిబంధనలకు విరుద్ధంగా పది మీటర్లు పైగా లోతుగా ఇసుకను తవ్వేస్తున్నారని, దాని కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదనకు గురై గుణపాడు గ్రామస్తులు గ్రామంలో వేబ్రిడ్జి వద్ద ఇసుక టిప్పర్లను అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు .ఇసుక రీచ్ ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు .

నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను త్రవ్వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు .త్రాగునీటి సమస్య ఏర్పడుతోందని , సాగునీరు లేక పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయని , రాబోయే రోజుల్లో చుక్క నీరు కోసం అవస్థలు పడే ప్రమాదం పొంచివుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ నేపథ్యంలో ఇసుక రీచ్ యాజమాన్యం తమ టిప్పర్లను అడ్డుకున్నారంటూ సమాచారంతో అక్కడికి పోలీసులు చేరుకున్నారు , పోలీసులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు..టిప్పర్లు ఇష్టానుసారంగా అధికలోడుతో వెళ్తున్నాయని , త్రాగునీరు సాగునీరు ఇబ్బందులు పడుతున్నామని పోలీసులకు గ్రామస్తులు వివరించారు . టిప్పర్లు అధికలోడుతో వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు .

## రైతాంగాన్ని ఆదుకుంటాం

**లంకలకోడేరు**

ఇటీవలే కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికే సంబంధిత అధికారులతో సమీక్షించి,వారిని క్షేత్రస్థాయిలో స్వీయ పరిశీలన జరిపి సమగ్రంగా పంట నష్టం నివేదిక రూపొందించాలని ఆదేశించారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ మరియు పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి అదేశాలు మేరకు ఈ రోజు తిల్లపూడి,దగ్గులురు,యస్.చిక్కాల,లంకలకోడెరు పలు గ్రామలలో పర్యటించి, సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చూడాలని ఆదేశించి,రైతులతో మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. లంకలకొడేరు మలుపులో వున్న రైస్ మిల్లు ను పర్యటించి రైతులు పండించిన ధాన్యం కనుగొలు చేయాలని రైతులను ఇబ్బంది లేకుండా చూడాలని పలు సూచనలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ నడపన గోవిందరాజులు నాయుడు ,ఏఊా కన్వీనర్ పార్శి వెంకటరత్నం , దగ్గులూరు సర్పంచ్ విశ్వనాధం కనకభద్రం ,పేరయ్య గారు,సప్పారపు కోటేశ్వరరావు ,ఆకుల నాగ మురళి ,మండల,గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## యువ సంఘర్షణ సభకు తరలిన కాంగ్రెస్ నేతలు

**మెట్ పల్లి**

హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన యువ సంఘర్షణ యూత్ డిక్లరేషన్ సభకు మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఖుతుబోద్దిన్ పాషా, కోరుట్ల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోగ్రాభి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఏఆర్ అక్బర్, నాయకులు వాసిక్ అస్గర్ లు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో జరిగే కాంగ్రెస్ పార్టీ యువ సంఘర్షణ సభకు ఆల్ ఇండియా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హాజరవుతున్నారని. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థులకు నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాన్ని వివరించనున్నారని. విద్యార్థులకు నిరుద్యోగులకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చి తీరుతామని. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో తెర్నేకల్ వాసి మృతి

**పత్తికొండ**

పత్తికొండ నుండి దేవన కొండ వైపు వెళ్తున్న బైక్ కు అతి వేగంగా వచ్చిన జింక జింక ను తప్పించబోయో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పత్తికొండ మండలంలో చోటు చేసుకుంది. మండలం పరిధిలోని దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పత్తికొండ మండలం కనకదిన్నె గ్రామా సమీపంలో అతి వేగంగా వచ్చిన జింక ను తప్పించబోయో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలొ మృతి చెందిన వ్యక్తి తేర్నకల్ హుస్సేన్, మృతి చెందగా, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## ఇంటిపై కూలిన ఆర్మీ హెలికాప్టర్, ఇద్దరు మృతి

**జైపూర్**

ఆర్మీ హెలికాప్టర్లు, చాపర్లు కూలిపోతున్న ఘటనలు ఈ మధ్య కాలంలో పెరిగిపోయాయి. ఇటీవలే జమ్ముకశ్మీర్లో ఓ చాపర్ కూలిపోయి ఓ పైలట్ మృతి చెందాడు. ఇప్పుడు మరోసారి ఇలాంటి దుర్ఘటనే జరిగింది. రాజస్థాన్లోని హనుమాన్మార్గ్లో ఆర్మీ హెలికాప్టర్ కుప్ప కూలింది. సూరత్గర్ నుంచి టేకాఫ్ అయిన చాపర్...కాసేపటికే కూలిపోయింది. పారాచూట్ సాయంతో పైలట్ సహా కో పైలట్ కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే...ఆ చాపర్ ఓ ఇంటిపై కూలడం వల్ల ఆ ఇంట్లోని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఏడాది జనవరిలోనూ సుఖోయ్, మిరేగ్ విమానాలు కుప్ప కూలిన ఘటనల్లో ఓ పైలట్ ప్రాణాలు కోల్పోయాడు. రాజస్థాన్లోనే భరత్పూర్లో జరిగిందీ ఘటన. మధ్యప్రదేశ్లోనూ మొరెనా ప్రాంతంలో ఓ ఆర్మీ హెలికాప్టర్ కూలింది. ఏప్రిల్లో కొచ్చిలో కోస్ట్ గార్డ్ హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఇలా తరచూ ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి.

**జమ్ముకశ్మీర్ లో**

జమ్ముకశ్మీర్ లోని కిశ్త్ వార్ఘ సమీపంలో ఓ ఆర్మీ హెలికాప్టర్ ఇటీవలే కుప్పకూలింది. ఈ ఘటనలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ ఆర్మీ జవాన్ మరణించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ కు చెందిన పబ్బాల అనిల్ అనే ఆర్మీ జవాన్ జమ్ము కశ్మీర్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. అనిల్ గత 11 ఏళ్లుగా ఆర్మీలో పని చేస్తుండగా.. జమ్ము కశ్మీర్ వద్ద సిగ్నల్ సమస్యల వలన అనిల్ తో పాటు మరో ఇద్దరు ప్రయాణిస్తున్న "ఆర్మీ ఏఎల్ హెచ్ ధ్రువ్" హెలికాప్టర్ నదిలో పడిపోయింది. అయితే విషయం తెలుసుకున్న అధికారులు.. మార్వా ప్రాంతంలోని నదిలో హెలికాప్టర్ శకలాలు గుర్తించారు. ఆ ప్రమాదంలో అనిల్ మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆర్మీ జవాన్ అనిల్ కు భార్య సౌజన్య, ఇద్దరు కుమారులు అయాన్, ఆరవ్, తల్లి తండ్రులు మల్లయ్య, లక్ష్మి, ఇద్దరు సోదరులు శ్రీనివాస్, మహేందర్ ఉన్నారు. ధ్రువ్ హెలికాప్టర్లు కూలిపోతుండటం వల్ల కొన్ని రోజుల పాటు వాటిని వాడకూడదని నిర్ణయించుకుంది ఆర్మీ. మరి కొన్ని హెలికాప్టర్లు కూడా ఇలానే సాంకేతిక సమస్యలతో ప్రమాదాలు కొని తెస్తున్నాయి.

## తిరుమలలో బయటపడ్డ నిఘా వైఫల్యం

**- సెల్ఫోన్తో ఆనంద నిలయం వీడియో చిత్రీకరణ**

**- సోషల్ మీడియాలో వైరల్**

**తిరమల**

ఏడుకొండల వాడు వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమలలో టీటీడీ విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులో వద్ద చేస్తున్న భక్తుల తనిఖీల్లో నిఘా సిబ్బంది నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి శ్రీవారి ఆలయంలోకి ఓ భక్తుడు మొబైల్ ఫోన్ తో ప్రవేశించాడు. శ్రీనివాసుడి దర్శనానికి వెళ్తున్న సమయంలో ఆలయాన్ని చిత్రీకరించాడు. సెల్ ఫోన్ లో పలు వీడియోలు, ఫొటోలు తీశాడు. ఆనంద నిలయాన్ని అతి సమీపం నుంచి మొబైల్ ఫోన్ లో చిత్రికరించాడు. అంతేకాకుండా శ్రీవారి ఆలయంలోని పలు ఉప ఆలయాలను కూడా ఫొటోలు తీశాడు. స్వామి వారి దర్శనం చేసుకున్న తర్వాత ఆ భక్తుడు తిరిగి వెళ్లిపోయాడు. ఈ విషయం తాజాగా వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.

**ఏప్రిల్ 25వ తేదీన తిరుమలలో చక్కర్లు కొట్టిన హెలికాప్టర్**

తిరుమలలో హెలికాప్టర్ లు చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. శ్రీవారి ఆలయంపై మూడు హెలికాప్టర్లు చక్కర్లు కొట్టాయి. తిరుమల శ్రీవారి ఆలయాన్ని నో ఫ్లైయింగ్ జోన్ గా టీటీడీ ప్రకటించింది. హెలికాప్టర్లు చక్కర్లు కొట్టడంపై అప్రమత్తమైన టీటీడీ.. విచారణ చేపట్టింది. అయితే తిరుమలపై చక్కర్లు కొట్టిన హెలికాప్టర్లు ఏయిర్ పోర్స్ విభాగానికి చెందినవిగా గుర్తించారు. కడప నుంచి చెన్నైకి వెళ్లే సమయంలో తిరుమల మీదుగా ప్రయాణించినట్లు సమాచారం.

మూడు హెలికాప్టర్లు చక్కర్లు

శ్రీవారి ఆలయం పరిసరాల్లో మూడు హెలికాప్టర్లు చక్కర్లు కొట్టాయి. దీంతో భక్తులను ఆందోళనకు గురైయ్యారు. శ్రీవారి ఆలయానికి సమీపంలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, పరాకమణి భవనం, బాలాజీనగర్ ప్రాంతంలో హెలికాప్టర్లు చక్కర్లు కొట్టినట్లు అధికారులు గుర్తించారు. తిరుమలలో 3 హెలికాప్టర్లు చక్కర్లు కొట్టడంపై టీటీడీ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఎయిర్ఫోర్స్కు చెందిన హెలికాప్టర్లు కడప నుంచి చెన్నై వెళ్తుండగా తిరుమల మీదుగా చక్కర్లు కొట్టినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ఈ ఘటనపై టీటీడీ అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

**గతంలో డ్రోన్ కలకలం**

తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఓ వీడియో ఇటీవల నెట్టింట హల్ చల్ చేసింది. ఈ వీడియో వైరల్ అవడంతో టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రోన్ కెమెరాల్లో శ్రీవారి ఆలయాల చిత్రీకరించడంపై ఆరా తీశారు. తిరుమల శ్రీవారి ఆలయంపై, పరిసర ప్రాంతాల్లో విమానాలు, డ్రోన్ కెమెరాలు నిషేధం ఉంది. అయితే శ్రీవారి ఆలయానికి సంబంధించిన వీడియాను ఓ యూట్యూబ్ ఛానల్ పోస్టు చేయడం కలకలంగా మారింది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్గా మారడంపై శ్రీవారి భక్తులు, ఆగమ సలహాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగమశాస్త్ర నిబంధనల మేరకు ఆనంద నిలయ గోపురం చిత్రీకరణకు అనుమతులు లేవని టీటీడీ తెలిపింది. శ్రీవారి ఆలయాన్ని చిత్రీకరించి, సోషల్ మీడియాలో వైరల్ చేసిన విజువల్స్ పై విచారణ జరిపి నిందితులను పట్టుకున్నారు. హైదరాబాద్ కు చెందిన వారు విజువల్స్ ని అప్లోడ్ చేసినట్లు గుర్తించారు. వీళ్లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు

## ప్రజావాణికి వచ్చే సమస్యలకు అధిక ప్రాధ్యాన ఇవ్వాలి

**జగిత్యాల,**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాసంబంధిత అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు మంద మకరందు, బి.ఎస్. లత తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

# జీవన్ ద్వంద వైఖరిని విడనాడాలి

**జగిత్యాల:**

అన్ని తెలిసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి అనుసరిస్తున్న ద్వంద వైఖరిని విడిచిపెట్టాలని రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుసరిస్తున్న రాజకీయం చూస్తుంటే విడ్డురంగా ఉందని ప్రజలకు వాస్తవాలను చెప్పడం మానేసి రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆరోపించారు. సర్పంచ్ లకు అనేక కష్టాలను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోందని జీవన్ అన్నారని సంజయ్ పేర్కొన్నారు. అన్ని తెలిసిన జీవన్ రెడ్డి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల జాప్యంతోనే ఈ సమస్య అని తెలిసినా ఏనాడు కేంద్రాన్ని కానీ ఎంపీ అర్వింద్ ను నిలదీసిన దాఖలాలు లేవన్నారు. కేవలం కేసీఆర్ టార్గెట్ గానే జీవన్ రాజకీయాలు చేస్తాడని గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీతో కుమ్మకైన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. బీజేపీతో మూలాఖత్ అయ్యి బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడమే జీవన్ రెడ్డి పనిగా పెట్టుకొన్నడన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లు కావాలి కానీ తెలంగాణ ప్రజలకు కేంద్రం నుంచి న్యాయంగా రావాల్సిన వాటిపై జీవన్ రెడ్డికి పట్టింపులేదన్నారు. విభజన చట్టం




ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటిపై ఏనాడు జీవన్ మాట్లాడారని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. గిరిజన యూనివర్సిటీ, నవోదయ విద్యాలయం, ఎన్టీపీసి నుంచి రాష్ట్రానికి రావాల్సిన 4 వేల మెగావాట్ల విద్యుత్ వంటి ఎన్నో విషయాలు ఉన్నా ఏనాడు జీవన్ రెడ్డి కేంద్రాన్ని నిలదీయడం లేదన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తున్నాడని ఈ పద్ధతి మానుకోవాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వంలోనే పల్లెలకు మహర్దశ పట్టిందని పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద అభివృద్ధి కోసం అత్యధిక నిధుల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, పారిశుధ్య కార్మికులకు మంచి వేతనాలు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. మీ కాంగ్రెస్ హయాంలో ఒక ట్రాన్స్ ఫార్మర్, నాలుగు స్తంభాలు కావాలంటే ఆఫీసుల చుట్టూ చెప్పులరిగెల తిరిగినా అందేవి కావని ఎమ్మెల్యే అన్నారు. నేడు వందల సంఖ్యలో ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామ గ్రామాన పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ దామాలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే అన్నారు. గ్రామానికో నర్సరీని ఏర్పాటుచేయగా గ్రామాలన్ని నందనవనాలుగా మారాయని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. నిరంతర విద్యుత్ ను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పీక్ అవర్లో కరెంట్ వినియోగం పెరగడంతో 20 రూపాయలకు ఒక యూనిట్ కొనుగోలు చేసి నాణ్యమైన విద్యుత్ ను ప్రజలకు అందించామని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్రంలో 46 వేల చెరువులను అభివృద్ధి చేసిన ఘనత మాదని 60 ఏండ్ల మీ కాంగ్రెస్ పాలనలో నిర్మించిన వాటర్ ట్యాంక్ లకు తొమ్మిది రేట్ల ట్యాంకులను నిర్మించామని ఎమ్మెల్యే సంజయ్ చెప్పారు. గత పార్లమెంట్ ఎన్నికల్లోనే జీవన్ రెడ్డి బీజేపీతో కలిసి పనిచేసిన ముచ్చట ప్రజలందరికీ తెలుసని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని జీవన్ రెడ్డి దమ్మిగా మార్చడం ఖాయమని ఎమ్మెల్యే సంజయ్ అంన్నారు. సోషల్ మీడియా పుణ్యమా అని నిజం గడప దాటక ముందే అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తోందని ఇటీవలే నాపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని ఇది వారి విజ్ఞతకే వదిలేశానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని రైతులకు నీళ్లివ్వకుండా, విద్యుత్ ఇవ్వకుండా, పెట్టుబడి సాయం ఇవ్వకుంటే ఇంత పెద్ద మొత్తంలో దిగుబడి వచ్చేదా అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కేసీఆర్ తీసుకొన్న నిర్ణయాలతోనే తెలంగాణలో ధరలు అదుపులో ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. కాళేశ్వరం నుంచి ఒక్క ఎకరానికి నీరందడం లేదంటూ జీవన్ చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని తెలిసిన సీనియర్ రాజకీయ నాయకులైన జీవన్ రెడ్డి ప్రజలకు నిజాలను చెప్పడం అలవాటు చేసుకోవాలని అసత్య ప్రచారాలు, విమర్శలు చేయడం మానుకోవాలని, ద్వంద వైఖరిని విధాలని ఎమ్మెల్యే కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటిపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత జీవన్ రెడ్డికి ఉందన్నారు. నూకలు ఎగుమతి లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ విషయంపై కేంద్రాన్ని జీవన్ రెడ్డి ఎందుకు నిలదీయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. సర్పంచులకు రావాల్సిన బిల్లుల చెల్లింపులు జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, సర్పంచుల ఫోరం చెరుకు జాన్, గంగాధర్, పాక్స్ ఛైర్మెన్ లు మహిపాల్ రెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, సందీప్ రావు, సర్పంచులు దామోదర్, మహేశ్వర రావు, తిరుపతి, రాజేశ్వర రెడ్డి,నాయకులు నాదెం శంకర్, ఎల్ల రాజన్న, అంజన్న, రౌతు గంగాధర్ తోపాటు పలువురు ఉన్నారు.

# ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు భూ పోరాటం ఆగదు

**సిపిఐ నేతలు చెన్న విశ్వనాథం ,సుతారి రాములు**

**కోరుట్ల,**

కోరుట్ల పట్టణంలోని సంగెం రోడ్డు జంబి గద్దె వద్దగల 922, 923, సర్వేనెంబర్ లోని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు భూ పోరాటం కొనసాగుతుందని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నేతలు చెన్న విశ్వనాథం సుతారి రాములు స్పష్టం చేశారు... సోమవారం రోజున గత నెలలో నివాస స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు వందలాది మంది గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ, సిబ్బంది



తొలగించడం సరికాదని, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భూ పోరాటమునకు మద్దతు తెలుపుతూ, పోరాటయోధులకు ధైర్యం నింపారు. కేంద్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ ఒకటి తర్వాత దేశంలో ఇల్లు లేని వారు ఉండకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, ఆ హామీని ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు సరిపోతలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామని, హామీ ఇచ్చారని కానీ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ హామీలను నెరవేర్చక పోవడంవల్లే, ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోవడం న్యాయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం పట్టణంలో సంపూర్ణ సర్వే చేసి రెండువేల మంది నిరుపేదలు ఉన్నట్లు వారికి డబుల్ బెడ్ రూములు ఇస్తామని కేవలం 80 ఇండ్ల వరకే ఇచ్చి మిగతా వారికి మొండి చేయి,చూపారని ఇల్లు లేక అద్దె కట్టలేక ఆర్థికంగా కుటుంబ భారం గగనమైన దశలో ,పేదలు ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు, వేసుకుంటున్నారని, వారికి నివాస స్థలాలు, ఇచ్చేంతవరకు భూ పోరాటం కొనసాగించాలని, పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నేతలు తిరుపతి నాయక్, రాష్ట్ర నేత బాలకృష్ణ, గుమ్మడి రమేష్, రజియా సుల్తానా, రిహానా బేగం, జిల్లా మమత, తోట జ్యోతి, చిలుక ఉమా, పిట్టల హేమలత, సిపిఐ నేతలు ఎన్నం రాధా, సాంబార్ మహేష్, రామిల్ల రాంబాబు, అందే రామయ్య, వంశీకృష్ణ, మ్యాదరి గణేష్, నోగోరి సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com

# కస్టడీ థియేటర్ లో బ్లాస్ట్ అవుతుంది



యంగ్ హీరో అక్కినేని నాగ చైతన్య, లీడింగ్ ఫిల్మ్ మేకర్ వెంకట్ ప్రభు ల తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ' మోస్ట్ ఎవైటెడ్ మూవీస్‌లో ఒకటి. కృతి శెట్టి కథానాయికగా నటిస్తోంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమా తెరకెక్కింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ని పవన్ కుమార్ సమర్పిస్తుండగా ,శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల అయిన టీజర్ ,ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మే 12న సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో కస్టడీ ప్రీరిలీజ్ ఈవెంట్ ని గ్రాండ్ గా నిర్వహించారు.

ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో నాగచైతన్య మాట్లాడుతూ.. అభిమానులు, ప్రేక్షక దేవుళ్ళకు కృతజ్ఞతలు. జోష్ సినిమా ఆడియో లాంచ్ లో వెంకీ మామ సౌండ్ అంటే ఇలా ఉంటుందని అభిమానులను ఉద్దేశించి చెప్పారు. ఆ సౌండ్ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడా తగ్గలేదు. కస్టడీ కథ వెంకట్ ప్రభు గారు చెప్పినప్పుడు లేచి ఆయన్ని గట్టిగా హాగ్ చేసుకున్నాను. నాకు అంత ఎక్సయిట్ మెంట్ ఇచ్చింది ఈ కథ. ఎడిటింగ్ రూమ్ లో చూసినప్పుడు కూడా అదే ఎక్సయిట్ మెంట్ ఇచ్చింది. వెంకట్ ప్రభు గారికి థాంక్స్. తమిళ్ లో ఆయన ఎన్నో హిట్లు ఇచ్చారు. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులని అలరించడానికి వచ్చిన ఆయనకు స్వాగతం పలుకుతున్నాను. అలాగే ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతలు శ్రీనివాస్ చిట్టూరి, పవన్ గారికి కృతజ్ఞతలు. ఈ సినిమాని నెక్స్ట్ లెవల్ లో కూర్చోబెట్టారు. నా కెరీర్ లో మోస్ట్ ఎక్స్ పెన్సీవ్ మూవీ ఇది. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. అరవింద్ స్వామి గారు ఈ కథ కి ఓకే చెప్పడంతో మా అందరికీ చాలా కాన్ఫిడెన్స్ వచ్చింది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. శరత్ కుమార్ గారికి, నాకు చాలా యూనిక్ యాక్షన్ డిజైన్ చేశారు. ప్రియమణి గారు తన పాత్రకు చాలా మంచి ఎలివేషన్ ఇచ్చారు. ఈ చిత్రంతో కృతి శెట్టి కెరీర్ మరో స్థాయికి వెళుతుందని నమ్ముతున్నాను. అబ్బూరి రవి గారు పవర్ ఫుల్ డైలాగ్స్ ఇచ్చారు. డీవోపీ కతీర్, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ , రామజోగయ్య శాస్త్రి గారికి, యాక్షన్ మాస్టర్స్ మహేష్, స్టంట్ శివ, డ్యాన్స్ మాస్టర్స్, మా పీఆర్వోలు వంశీ శేఖర్ కి థాంక్స్. ఇళయరాజా గారు, యువన్ శంకర్ రాజా గారి సంగీతం బ్లాక్ బస్టర్. థియేటర్ లో నేపథ్య సంగీతం ఒక రచ్చె. థియేటర్ లో ఒక మ్యాజిక్ చూపిస్తారు. సినిమా మొదటి ఇరవై నిమిషాలు కూల్ గా వెళుతుంది. ఇంటర్వెల్ కి ముందు నుంచి థియేటర్ లో బ్లాస్ట్ అవుతుంది. అద్భుతమైన యాక్షన్స్ సీక్వెన్స్ లు వుంటాయి. మీరు కొత్త చై ని చూడబోతున్నారు. వెంకట్ ప్రభుగారు అలా డిజైన్ చేశారు. మీ అందరూ నా కస్టడీ లోకి రావాలని, నా కస్టడీలోనే ఉండాలని కోరుకుంటున్నాను. మే 12న అందరం థియేటర్ లో కలుద్దాం. లవ్ యూ ఆల్" అన్నారు.

దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ.. కస్టడీ లో స్టైల్,యాక్షన్, ఫెర్ ఫార్మెన్స్ , సెంటిమెంట్, మాస్ ఇలా అన్నీ వున్నాయి. కస్టడీ నా కెరీర్ లో భారీ చిత్రం. నిర్మాతలు శ్రీనివాస గారికి , పవన్ గారికి కృతజ్ఞతలు. నాగ చైతన్యకి బిగ్ థాంక్స్. నన్ను బలంగా నమ్మారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాననే కాన్ఫిడెన్స్ ఉంది. కృతి శెట్టి వండర్ ఫుల్ యాక్టర్. ప్రియమణి గారు ఇందులో పాత్ర చేసినందుకు కృతజ్ఞతలు. అరవింద్ స్వామి గారు పవర్ ఫుల్ రోల్ చేశారు, ఇది శివ రాజు ల కథ. శరత్ కుమార్, సంపత్, వెన్నెల కిషోర్ ఈ చిత్రంలో నటించిన, పని చేసిన అందరికీ కృతజ్ఞతలు. ఇళయరాజా గారికి, యువన్ కి, ప్రేమ్ జీ కి.. అందరికీ కృతజ్ఞతలు. కస్టడీ 2 చేసినప్పుడు కచ్చితంగా తెలుగులో మాట్లాడతాను. మే 12 న కస్టడీ ని థియేటర్ లో చూడండి. తప్పకుండా సర్ ప్రైజ్ అవుతారు" అన్నారు

కృతి శెట్టి మాట్లాడుతూ.. కస్టడీ ట్రైలర్ కి ఇచ్చిన రెస్పాన్స్ చాలా బావుంది. ట్రైలర్ ఇంత నచ్చిందంటే సినిమా ఇంకా బాగా నచ్చుతుంది. ఇంత మంచి సినిమాలో పని చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు. వెంకట్ ప్రభు గారు రేవతి లాంటి మంచి పాత్రని ఇచ్చారు అరవింద్ స్వామి, ప్రియమణి, శరత్ కుమార్, వెన్నెల కిషోర్ ఇలా చక్కటి టీంతో కలసి పని చేయడం అనందాన్ని ఇచ్చింది. నాగ చైతన్య నా ఫేవరట్. నా బంగార్రాజు ..ఇప్పుడు నా శివ( నవ్వుతూ). నా జీవితంలో స్ఫూర్తి నిచ్చే వ్యక్తుల్లో చైతన్య ఒకరు. సినిమాకి పని చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. శివ తన డ్యూటీ కోసం ఫైట్ చేస్తాడు. రేవతి తన ప్రేమ కోసం ఫైట్ చేస్తుంది . మే 12న మీ అందరినీ కస్టడీలోకి తీసుకోవడానికి రెడీగా ఉన్నాం. అందరూ థియేటర్ లో కస్టడీ చూడండి"అన్నారు

ప్రియమణి మాట్లాడుతూ... నాగ చైతన్యతో పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. కృతి అద్భుతమైన నటి. వెంకట్ ప్రభు గారికి , నిర్మాతలకు కృతజ్ఞతలు. మే 12 న సినిమా వస్తోంది . అందరూ థియేటర్ లో చూడండి" అని కోరారు.

అబ్బూరి రవి మాట్లాడుతూ.. నన్ను ఇండస్ట్రీకి పరిచయం చేసింది త్రివిక్రమ్. 'వీడు అబ్బూరి రవి మాటల రచయిత' అని పరిచయం చేసింది మాత్రం నాగేశ్వర రావు గారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను. నాగార్జున గారికి ఊపిరి రాశాను. చైతన్య ఎప్పుడూ అభిమానుల ప్రేమ కస్టడీలో ఉంటారు. ఆయన సినిమాకి రాయడం చాలా అనందంగా వుంది. వెంకట్ ప్రభు గారికి ఒక ప్రత్యేకమైన స్టైల్ వుంది. ఆయన చెప్పినట్లు రాస్తే చాలు. నిర్మాతలకు కృతజ్ఞతలు" తెలిపారు.

# నీలకంఠ కొత్త సినిమా "సర్కిల్ "




మోస్ట్ టాలెంటెడ్ అండ్ నేషనల్అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ నీలకంఠ నుంచి మరో ఇంట్రెస్టింగ్ సినిమా రాబోతోంది. గతంలో షో అనే ఫీచర్ ఫిల్మ్ తో బెస్ట్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ స్క్రీన్ ప్లే విభాగాల్లో రెండు జాతీయ అవార్డులు, అలాగే విరోధి మరియు షో చిత్రాలు ఇండియన్ పనోరమ లో కూడ సెలెక్ట్ అయ్యాయి.ఆ చిత్రాల దర్శకుడు నీలకంఠ ఆ తర్వాత కమర్షియల్ సక్సెస్ తో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న మిస్సమ్మ, సదా మీ సేవలో వంటి చిత్రాలతో ఆకట్టుకున్నారు. కొంత గ్యాప్ తర్వాత ఇప్పుడు మరోసారి 'సర్కిల్' అనే చిత్రంతో వస్తున్నాడు నీలకంఠ. ఈ చిత్రానికి ఎవరు, ఎప్పుడు, ఎందుకు శతృవులవుతారో అనే ట్యాగ్ లైన్ ఆకట్టుకుంటోంది .తాజాగా ఈ చిత్ర టైటిల్ తో పాటు మోషన్ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. ఈ మోషన్ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఒక మోడల్ ఫోటో కెమెరా లెన్స్ తిరుగుతుండగా.. దానితో పాటు ఎవరు, ఎప్పుడు, ఎందుకు శతృవులవుతారో అనే ట్యాగ్ తో ఎండ్ అవుతుందీ మోషన్ పోస్టర్. చూస్తోంటే ఇది మరోసారి నీలకంఠ తరహాలోనే సాగే వైవిధ్యమైన సినిమాగా కనిపిస్తోంది. దీంతో పాటు చిత్ర తారాగణం సైతం ఆసక్తికరంగానే ఉంది.

ఆరా ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపొందుతోన్న ఈ సర్కిల్ చిత్రంలో నటీనటులుసాయి రోనక్, అర్షిణ్ మెహతా,

# అంతిమ తీర్పు' చిత్రంలో మంగ్లీ పాడిన 'టిప్పు.. టిప్పు' పాటకు అద్భుతమైన స్పందన



సాయి ధన్సిక, విమలారామన్, గణేష్ వెంకట్‌రామన్, అమిత్ తివారీ కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'అంతిమ తీర్పు'. ఎ. అభిరాం దర్శకత్వంలో సిద్ధి వినాయక డి.రాజేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'టిప్పా టిప్పా..టిప్పు.. టిప్పర్ లారీ నా ఒళ్లే.. రప్పు..రప్పు.. రప్పు వత్తే యాక్సిడేంటేలే' అంటూ సాగే పాటను సాంగ్ ఇటీవల విడుదల చేశారు. కోటి సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ రచించిన పాట ఇది. మంగ్లీ ఆలపించారు. అమిత్‌తివారీ, స్నేహా గుప్తా ఆ పాటలో ఆడాపాడారు. ఈశ్వర్ పెంటి ఈ పాటకు డాన్స్ కొరియోగ్రఫీ చేశారు.

దర్శకనిర్మాతలు మాట్లాడుతూ "చక్కని కథాంశంతో రూపొందిన చిత్రమిది. చిత్రీకరణ పూర్తయింది. 'టిప్పా టిప్పా' సాంగ్ చక్కని డాన్స్ నంబర్. ఈ పాటను డాగ్ హౌస్‌లో నాలుగు రోజులపాటు చిత్రీకరణ చేశాం. టి.సిరీస్ ద్వారా విడుదల చేశాం. కోటి గారు ప్రతి పాటకు చక్కని స్వరాలు అందించారు. ఇటీవల విడుదల చేసిన 'టిప్పా టిప్పా..టిప్పు.. టిప్పర్ లారీ నా ఒళ్లే.. రప్పు..రప్పు.. రప్పు వత్తే యాక్సిడేంటేలే' పాటకు అద్భుతమైన స్పందన వస్తోంది. మంగ్లీ హస్కీ వాయిస్‌తో పాడిన ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇదే ఉత్సాహంతో 'త్వరలో సెకెండ్ లిరికల్ సాంగ్, టీజర్‌ను విడుదల చేస్తాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని అన్నారు.నటీనటులు:

సాయి ధన్సిక, విమలారామన్, గణేష్ వెంకట్‌రామన్, అమిత్ తివారీ, దీపు, సత్య ప్రకాశ్, నాగ మహేశ్ తదితరులు.

# 'లాల్ సలాం'లో సూపర్ స్టార్ రజనీకాంత్ ఫస్ట్ లుక్ పోస్టర్



భారీ బడ్జెట్ విజువల్ వండర్స్ చిత్రాలతో పాటు డిఫరెంట్ కంటెంట్ చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ చిత్ర నిర్మాణ రంగంలో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్. రీసెంట్‌గా విడుదలైన పాన్ ఇండియా మూవీ పొన్నియిన్ సెల్వన్ 2తో సూపర్ సక్సెస్‌ను సాధించిన లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో రానున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'లాల్ సలాం'. ఐశ్వర్య రజినీకాంత్ దర్శకత్వంలో సినిమా తెరకెక్కుతోంది. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తోన్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ చిత్రంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ కీలక పాత్రను పోషిస్తున్నారనే సంగతి తెలిసిందే.

సోమవారం (మే 8) రోజున తలైవర్, సూపర్ స్టార్ రజినీకాంత్.. 'లాల్ సలాం' చిత్రంలో పోషిస్తోన్న 'మొయిద్దీన్ భాయ్' క్యారెక్టర్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. లుక్‌ను గమనిస్తే ముస్లిం గెటప్‌లో రజినీకాంత్ రాయల్‌గా నడిచివస్తున్నారు. తలైవర్ మాస్ గెటప్ ఓ రేంజ్‌లో ఉంది. బాషాలో మాణిక్ బాషాగా అలరించిన మన సూపర్ స్టార్ ఇప్పుడు లాల్ సలాంలో మొయిద్దీన్ భాయ్‌గా మెప్పించబోతున్నారు.ఈ సందర్భంగా లైకా ప్రతినిధులు మాట్లాడుతూ "డిఫరెంట్ చిత్రాలను అందించటానికి మా లైకా ప్రొడక్షన్స్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. లాల్ సలాం విషయానికి వస్తే ఐశ్వర్య రజినీకాంత్‌గారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో సూపర్‌స్టార్ రజినీకాంత్‌గారు మొయిద్దీన్ భాయ్ అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన లుక్‌ను విడుదల చేయటం చాలా హ్యాపీగా ఉంటుంది. ఆయన తనదైన స్టైల్‌లో రాకింగ్ పెర్ఫామెన్స్‌తో ఈ చిత్రంలోనూ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటారనటంలో సందేహం లేదు. . ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. విష్ణు రామస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు" అని తెలిపారు.

నటీనటులు:సూపర్‌స్టార్ రజినీకాంత్, విష్ణు విశాల్, విక్రాంత్ తదితరులు

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950